ప్రతి అక్షరం ప్రజాహితం

RNI No: APTEL -2023/89112 www.andhrapragathi.com

నేటి ఆంధ్రప్రగతి

తెలుగు దినపత్రిక

సంపుటి - 03 సంచిక -2 పేజీలు - 08 వెల - 04/-

శనివారం 6 డిసెంబర్ 2025

## విదేశీ విద్యకు భరోసా

# 'కలలకు రెక్కలు'

### బామిని పేరెంట్స్ టీచర్స్ మీటింగ్‌లో చంద్రబాబు





**వెనుకబడిన పిల్లల విషయంలో ప్రత్యేక శ్రద్ధ**

**షైనింగ్ స్టార్స్ కార్యక్రమం ప్రవేశపెట్టాం**

**జగన్ హయాంలో విద్యా వ్యవస్థను అస్థవ్యస్తం**

**లోకేశ్ ఏరికోరి విద్యాశాఖ తీసుకున్నాడు**

పార్వతీపురం **డిసెంబర్,5,ఆంధ్ర ప్రగతి**

చదువులో వెనుకబడిన పిల్లల విషయంలో ప్రత్యేక శ్రద్ధ పెట్టామని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. ప్రతిభ గల విద్యార్థులను ప్రోత్సహించడానికి షైనింగ్ స్టార్స్ కార్యక్రమం ప్రవేశపెట్టామని పేర్కొన్నారు. జగన్ హయాంలో విద్యా వ్యవస్థను అస్థవ్యస్తం చేశారని.. ఆ పరిస్థితిని తమ ప్రభుత్వంలో చక్కదిద్దామని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వంలో స్పష్టమైన విధానంతో ముందుకెళు_న్నామని వివరించారు. స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీలో విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ చదివారని.. రాష్ట్రంలోని విద్యార్థులను కూడా అదే స్థాయికి తీసుకెళ్లాలని సూచించారు.

మిగతా 2లో.

## చమురు రవాణా

# ఆగదు..!

### భారత్‌తో బంధం మరింత బలోపేతం



**భారత్-రష్యా మధ్య 64 బిలియన్ డాలర్ల వ్యాపారం**

**ఇరుదేశాల మధ్య మరింత వాణిజ్య సహకారం**

**సొంత కరెన్సీలతో వ్యాపారానికి చేరువగా ఉన్నాం**

**అణువిద్యుత్ తదితర రంగాల్లో సహకారం కొనసాగిస్తాం**

**ఉగ్రవాదంపై పోరులో భారత్‌తో కలసి నడుస్తాం**

**ఉక్రెయిన్‌తో యుద్ధంపై మోడీ సూచనలు స్వాగతిస్తున్నాం**

**మోడీతో భేటీలో సంయుక్త మీడియా సమావేశంలో పుతిన్**



న్యూఢిల్లీ, **డిసెంబర్,5,ఆంధ్ర ప్రగతి**

టెర్రరిజానికి వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటంలో భారత్‌తో కలిసి నడుస్తామని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ అన్నారు. టెర్రరిజాన్ని పూర్తిగా నాశనం చేసేందుకు భారత్‌కు అండగా ఉంటామని స్పష్టం చేశారు. శుక్రవారం ఢిల్లీలోని హైదరాబాద్ హౌస్‌లో ద్వైపాక్షిక శిఖరాగ్ర సమావేశంలో ప్రధాని మోదీ, పుతిన్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పుతిన్ మాట్లాడుతూ.. 'మోదీతో నిర్మాణాత్మక చర్చలు జరిగాయి. భారత్ ఆతిథ్యం ఎంతో సంతోషాన్నిచ్చింది

మిగతా 2లో.



## వాహన, గృహ రుణదారులకు ఊరట..

**వడ్డీ రేట్లను తగ్గించిన ఆర్‌బీఐ**

**రెపో రేటును 0.25 శాతం తగ్గించిన ఆర్‌బీఐ**

**5.5 శాతం నుంచి 5.25 శాతానికి చేరిన వడ్డీ రేటు**

**ఆర్థిక వ్యవస్థలోకి లక్ష కోట్ల నగదు పంపిణీకి నిర్ణయం**

**దేశ జీడీపీ వృద్ధి అంచనా 7.3 శాతానికి పెంపు**

న్యూఢిల్లీ,**డిసెంబర్,5,ఆంధ్ర ప్రగతి**

భారత ఆర్థిక వ్యవస్థ వృద్ధికి ఊతమిచ్చే దిశగా భారత రిజర్వ్ బ్యాంకు కీలక నిర్ణయం తీసుకుంది. కీలకమైన రెపో రేటును 25 బేసిస్ పాయింట్లు (0.25%) తగ్గిస్తున్నట్లు ప్రకటించింది. ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా అధ్యక్షతన జరిగిన ద్రవ్య పరపతి కమిటీ సమావేశంలో

మిగతా 2లో.

## ఇండిగో సంక్షోభంపై దర్యాప్తు

**రంగంలోకి దిగిన కేంద్రప్రభుత్వం**

**సర్వీసుల పునరుద్ధరణకు తక్షణ చర్యలు**

**కాల్ సెంటర్ ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు**




న్యూఢిల్లీ,**డిసెంబర్,5,ఆంధ్ర ప్రగతి**

ఇండిగో సంక్షోభంపై విచారణకు కేంద్రం ఆదేశించింది. సంక్షోభం నేపథ్యంలో సమస్యను పరిష్కరించేందుకు వెంటనే కేంద్రం రంగంలోకి దిగింది.

మిగతా 2లో.

## చదువుకు మీడియం

# అడ్డంకి కాదు



**గురువును దైవంగా భావించే సంస్కృతి మనది**

**మనపై ఉపాధ్యాయుల ప్రభావమే ఎక్కువ**

**చిలకలూరిపేట పేరెంట్స్ మీట్‌లో పవన్ కళ్యాణ్**




పల్నాడు, **డిసెంబర్,5,ఆంధ్ర ప్రగతి**

గురువును దైవంగా భావించే అరుదైన సంస్కృతి మనదని, తల్లిదండ్రుల కంటే ఉపాధ్యాయులే మనల్ని ఎక్కువగా ప్రభావితం చేస్తారని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అన్నారు. చదువు చాలా బలమైన ఆయుధమని, లక్ష మెదళ్లను కదిలించే శక్తి విద్యకు మాత్రమే సాధ్యమని అన్నారు. ఏ మాధ్యమంలో చదివామనేది ముఖ్యం కాదని.. విభిన్న అంశాలపై పట్టు సాధించడం ముఖ్యమని సూచించారు.

మిగతా 2లో.



## చంద్రబాబును కలిసిన మంత్రి కోమటిరెడ్డి

**గ్లోబల్ సమ్మిట్ కు ఆహ్వాన పత్రిక అందచేత**

అమరావతి,**డిసెంబర్,5,ఆంధ్ర ప్రగతి**

చంద్రబాబు విజన్‌కి తగ్గట్టు అమరావతి ఫ్యూచరిస్టిక్ క్యాపిటల్‌గా అభివృద్ధి చెందుతోందని తెలంగాణ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లో జరిగే తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌కు ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబును ఆహ్వానించేందుకు ఉండవల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయానికి వచ్చిన కోమటిరెడ్డి మీడియాతో మాట్లాడారు.

## దేవాలయాల సంపద దేవుడిదే..

# బ్యాంకులకు వాడొద్దు

### : సుప్రీంకోర్టు సంచలన తీర్పు

**గుడి డబ్బును సహకార బ్యాంకుల కోసం వాడరాదని ఆదేశం**

**కేరళ హైకోర్టు తీర్పును సమర్థించిన సర్వోన్నత న్యాయస్థానం**

**ప్రజల నమ్మకాన్ని బ్యాంకులు చూరగొనాలని జస్టిస్ సూర్యకాంత్ హితవు**



న్యూఢిల్లీ, **డిసెంబర్,5,ఆంధ్ర ప్రగతి**

దేవాలయాల ఆస్తులు, సంపదకు సంబంధించి సుప్రీంకోర్టు శుక్రవారం ఒక సంచలన తీర్పు వెలువరించింది. ఆలయాల సంపద దేవుడికే చెందుతుందని, దాన్ని సహకార బ్యాంకుల మనుగడ కోసం వినియోగించరాదని

మిగతా 2లో.

## ఎన్ని సార్లయినా ఢిల్లీ వెళతా

**ప్రధానిని, కేంద్రమంత్రులను కలుస్తూనే ఉంటా**

**నిధులు, అనుమతుల కోసం సిఎంగా నా బాధ్యత**

**నర్సంపేట సభలో సిఎం సంచలన వ్యాఖ్యలు**

వరంగల్,**డిసెంబర్,5,ఆంధ్ర ప్రగతి**

ఢిల్లీ పర్యటనలు, ప్రధాని మోడీ, కేంద్ర మంత్రులను కలవడంపై ప్రతిపక్ష బీఆర్ఎస్ చేస్తోన్న విమర్శలను సీఎం రేవంత్ రెడ్డి గట్టిగా తిప్పికొట్టారు. సిఎంగా ఢిల్లీ వెళ్లి ప్రధానిని, మంత్రులను కలవడం ధర్మమని అన్నారు. తెలంగాణ అభివృద్ధి కోసం ఎవరినైనా కలుస్తా. ఎవరితోనైనా కొట్లాడుతా.. ఢిల్లీనైనా ఢీ కొడుతా. నిధులు తీసుకొస్తా. అడగాడనికి వెనుకాడను.

మిగతా 2లో.



## ఏపీలో యూనివర్సల్ హెల్త్ పాలసీ..

### రూ. 25 లక్షల వరకు ఉచిత వైద్యం

**పేద కుటుంబాలకు రూ. 25 లక్షల వరకు ఉచిత వైద్యం**

**హైబ్రిడ్ మోడ్‌లో ఎన్టీఆర్ వైద్యసేవకు టెండర్ల ఆహ్వానం**

**రాష్ట్రంలో 1.63 కోట్ల కుటుంబాలకు లబ్ధి**

అమరావతి,**డిసెంబర్,5,ఆంధ్ర ప్రగతి**

రాష్ట్రంలోని ప్రజలందరికీ నాణ్యమైన వైద్యాన్ని అందించే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న 'యూనివర్సల్ హెల్త్ పాలసీ' అమలుకు తొలి అడుగు పడింది. పేద, ధనిక అనే తేడా లేకుండా ప్రతి కుటుంబానికి ఆరోగ్య భరోసా కల్పించే ఈ పథకం కింద రూ. 25 లక్షల వరకు ఉచిత వైద్య సేవలు

మిగతా 2లో.





ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక



# చమురు రవాణా ఆగదు..!

.(మొదటి పేజీ తరువాయి)

అనేక అంశాల్లో ఇరుదేశాల మధ్య అవగాహన కుదిరింది. విభిన్న అంశాలపై పరస్పరం అభిప్రాయాలు పంచుకున్నాం. భారత్-రష్యా మధ్య 64 బిలియన్ డాలర్ల వ్యాపారం జరిగింది. ఇరుదేశాల మధ్య ట్రేడ్ మరింత పెంచేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఆయిల్ సహా అన్ని రంగాల్లో సహకారం అందిస్తాం. ఉమ్మడి ప్రాజెక్టులు, సాంకేతిక అంశాల్లో పరస్పర సహకారం ఉంటుంది. సొంత కరెన్సీల్లో ఇరుదేశాల మధ్య వాణిజ్యం జరుగుతోంది. కొడంకుళం అణువిద్యుత్ ప్రాజెక్టుకు సహకరిస్తాం. విద్యుత్ రంగంలో ఖర్చు తగ్గింపునకు సాయం అందిస్తాం. భారత్‌తో కీలక ఒప్పందాలపై సంతకాలు జరిగాయి. భారత్‌కు నిరంతరంగా ఇంధనాన్ని సరఫరా చేయడానికి సిద్ధంగా ఉన్నాం' అని అన్నారు. భారతదేశం బ్రిక్స్ అధ్యక్ష పదవిని చేపడుతుందని అధ్యక్షుడు పుతిన్ తెలిపారు. వచ్చే ఏడాది భారతదేశం బ్రిక్స్ అధ్యక్ష పదవిని చేపడుతుందన్నారు. భారత్‌కు అవసరమైన అన్ని రకాల సహాయాన్ని అందిస్తామన్నారు. ఉక్రెయిన్‌తో జరుగుతున్న యుద్ధాన్ని ఆపటానికి ప్రధాని మోదీ ఎంతో ప్రయత్నిస్తున్నారని చెప్పారు. యుద్ధం ఆపే ప్లాన్ గురించి తనకు వివరించి చెప్పారని అన్నారు. అమెరికా లాంటి దేశాల నుంచి వాణిజ్య ఒత్తిడులు ఎదురైతున్నప్పటికీ .. భారత్- రష్యా మధ్య ఇంధన సరఫరా కొనసాగుతుందని స్పష్టం చేశారు. పశ్చిమ దేశాల నుంచి వస్తున్న ఒత్తిడుల కారణంగా కొంతకాలంగా చమురు దిగుమతులను భారత్



తగ్గించినప్పటికీ.. ఆ దేశాభివృద్ధికి సహకరించడం కోసం సరఫరాను పెంచేందుకు చర్యలు చేపడతామని పేర్కొన్నారు. గతేడాది భారత్-రష్యా మధ్య ద్వైపాక్షిక వాణిజ్యం 12 శాతం పెరిగి.. రికార్డు సృష్టించిందని రష్యా అధ్యక్షుడు అన్నారు. ఈ ఏడాది కూడా ఇదే స్థాయిలో పెరుగుదల ఉంటుందని విశ్వాసం వ్యక్తం చేశారు. ఇరు దేశాల ద్వైపాక్షిక వాణిజ్యం 2030 నాటికి 100 బిలియన్ డాలర్లకు చేరుతుందని పుతిన్ ఆశాభావం వ్యక్తం చేశారు. రక్షణ సహకారాన్ని కూడా మరింత విస్తరిస్తామని తెలిపారు. రష్యా దృష్టి పెట్టాల్సిన కీలక సవాళ్ల గురించి మోదీ తనతో చర్చించారని.. భారత్- యురేషియా ఆర్థిక సంఘం మధ్య స్వేచ్ఛా వాణిజ్య మండలాన్ని సృష్టించడం వంటి వాణిజ్య సంబంధాలను బలోపేతం చేయడానికి ప్రయత్నాలు కొనసాగుతున్నాయన్నారు. అంతే కాకుండా భారత్-రష్యా క్రమంగా చెల్లింపుల కోసం తమ జాతీయ కరెన్సీలను ఉపయోగించే దిశగా కదులు తున్నాయని.. దాదాపు 96 శాతం వాణిజ్య చెల్లింపులు జాతీయ కరెన్సీలలోనే జరుగుతున్నాయన్నారు. మీడియా సమావేశంలో మోదీ మాట్లాడుతూ.. ఉగ్రవాదంపై పోరుకు భారత్- రష్యా కలిసి నడుస్తాయన్నారు. ఇటీవల పహల్గాంలో జరిగిన దాడికి, గతేడాది రష్యా రాజధాని మాస్కో లోని క్రాకస్ సిటీ కాన్సర్ట్ హాల్‌లో జరిగిన దాడికి మూల కారణం ఉగ్రవాదమేనని అన్నారు. మానవత్వ విలువలపై చేస్తున్న ఈ ప్రత్యక్ష దాడులకు వ్యతిరేకంగా ఉగ్రవాదంపై పోరుకు ఇరుదేశాలు ఏకమైనట్లు తెలిపారు. భారత్, రష్యా, యూఎన్, జీ20, బ్రిక్స్ వేదికలు సన్నిహిత సహకారాన్ని కలిగి ఉన్నాయని.. ఈ వేదికలన్నింటిలో ఉగ్రవాదానికి వ్యతిరేకంగా సహకారాన్ని కొనసాగిస్తామన్నారు.

## ఇండిగో సంక్షోభంపై దర్యాప్తు

(మొదటి పేజీ తరువాయి)

నిర్వహణాపరమైన లోపాల కారణంగా దేశీయ విమానయాన సంస్థ ఇండిగో విమాన సర్వీసులకు తీవ్ర ఆటంకం కలుగుతోంది. దాంతో వేలాది మంది ప్రయాణికులు అవస్థలు పడుతుండగా.. ఈ గందరగోళం ఇప్పుడప్పుడే కొలిక్కి వచ్చేలా కనిపించడం లేదు. ఈ నేపథ్యంలో కేంద్రం రంగంలోకి దిగింది. శుక్రవారం ఉన్నతస్థాయి విచారణకు ఆదేశించింది. సేవల్లో అంతరాయానికి గల కారణాలను విచారించనుంది. బాధ్యులను గుర్తించి తగిన చర్యలు తీసుకుంటామని వెల్లడించింది. భవిష్యత్తులో ఇలాంటి అంతరాయాలు చోటుచేసుకోకుండా ఈ విచారణలో భాగంగా అధికారులు సిఫార్సులు చేయనున్నారు. ఇక ప్రస్తుత పరిస్థితులపై పౌరవిమానయాన శాఖ నిరంతరం సమీక్ష జరుపుతోంది. విమాన కార్యకలాపాలను సాధారణ స్థితికి తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకుంటోంది. ప్రయాణికులకు ఎప్పటికప్పుడు అప్‌డేట్లు అందించేలా 24/7 అందుబాటులో ఉండేలా కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసింది. విమానయాన సంస్థలతో సమన్వయం, ప్రస్తుత సమస్యలకు తక్షణ పరిష్కారం చూపే లక్ష్యంతో దీనిని అందుబాటులోకి తెచ్చారు. కంట్రోల్ రూమ్‌కు కాల్ చేయాల్సిన నంబర్లు 011-24610843, 011-24693963, 096503-91859 అని తెలిపింది. ఈ క్రమంలో ఇండిగో సంక్షోభంపై ఉన్నత స్థాయి దర్యాప్తునకు నిర్ణయించినట్టు తెలిపింది. సంక్షోభానికి కారకులైన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొంది. గత నాలుగైదు రోజులుగా ఇండిగో విమాన సర్వీసుల సామూహిక రద్దుతో తలెత్తిన సంక్షోభంపై ఉన్నత స్థాయి దర్యాప్తునకు ప్రభుత్వం నిర్ణయించినట్టు కేంద్ర విమానయాన శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. ఇండిగో సర్వీసుల్లో ఎక్కడ పొరపాటు జరిగింది, ఇందుకు బాధ్యులెవరనేది దర్యాప్తులో గుర్తించి, అవరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొంది. భవిష్యత్తుల్లో ఇలాంటి అంతరాయాలు తలెత్తకుండా, ప్రయాణికులకు కష్టం కలకుండా చూస్తామని వివరించింది. ప్రయాణికుల భద్రత విషయంలో ఎలాంటి రాజీ లేదని, ముఖ్యంగా సీనియర్ సిటిజన్లు, విద్యార్థులు, పేషెంట్లు, ఇతరులు అ÷-జర్గ÷ంట్ అవసరాల కోసం ప్రయాణాలు సాగిస్తుంటారని, వారికి ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూడాల్సి ఉంటుందని పేర్కొంది. ్÷÷-లట్ సర్వీసులు శనివారం నుంచి తిరిగి ప్రారంభమవుతాయని అంచనా వేస్తున్నామని, మూడు రోజుల్లోగా పూర్తిగా పునరుద్ధిస్తామని తెలిపింది.కాగా, నలుగురు సభ్యులతో కూడిన దర్యాప్తు కమిటీని కేంద్రం పౌరవిమానయాన మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేసింది. దేశవ్యాప్తంగా ఇండిగో ఫ్లైట్స్‌కు కలిగిన తీవ్ర అంతరాయం, ఇందుకు దారితీసిన పరిస్థితులపై కమిటీ దర్యాప్తు చేసి నివేదికను 15 రోజుల్లోగా సమర్పించనుంది.

## చంద్రబాబును కలిసిన మంత్రి కోమటిరెడ్డి

(మొదటి పేజీ తరువాయి)

పవన్ కల్యాణ్‌పై అప్పటి పరిస్థితుల మేరకు వ్యాఖ్యలు చేశా.. ఇప్పుడు చంద్రబాబును ఆహ్వానించడానికి వచ్చా. రెండు రాష్ట్రాలు కలిసి ఉండాలి.. అదే స్నేహం కొనసాగాలి. చంద్రబాబు విజన్ 2020 అభివృద్ధికి ప్రతిరూపం హైదరాబాద్ అని మంత్రి కోమటిరెడ్డి అన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును తెలంగాణ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి శుక్రవారం కలిశారు. ఉండవల్లిలో చంద్రబాబు నివాసంలో మంత్రి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌కు సీఎం చంద్రబాబును ఆహ్వానించారు. అనంతరం ఇరు రాష్ట్రాలకు సంబంధించిన పలు కీలక అంశాలపై చర్చించినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో మీడియాతో మాట్లాడారు మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి.తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌కు సీఎం చంద్రబాబును ఆహ్వానించేందుకు తాను అమరావతికి వచ్చానని తెలిపారు. హైదరాబాద్‌లో హైటెక్ సిటీ ఏర్పాటయ్యాక పక్కనే రహేజా మైండ్ స్పేస్‌లో ఐదు లక్షల మంది ఉద్యోగులు పనిచేస్తున్నారని వివరించారు. బెంగళూరు తర్వాత హైదరాబాద్ ఐటీ రంగంలో రెండో స్థానంలో ఉందని చెప్పుకొచ్చారు. తెలంగాణ ప్రభుత్వం గ్లోబల్ సమ్మిట్ నిర్వహిస్తోందని.. ఈ క్రమంలోనే అన్ని రాష్ట్రాల సీఎంలను ఆహ్వానిస్తున్నామని పేర్కొన్నారు.ఇందులో భాగంగా ఏపీ ముఖ్యమంత్రి, సీనియర్ నేత చంద్రబాబు నాయుడును ఆహ్వానించేందుకు వచ్చానని తెలిపారు. సీఎం చంద్రబాబు తప్పకుండా సమ్మిట్‌కు హాజరవుతారనే తాము భావిస్తున్నామని పేర్కొన్నారు. తెలంగాణలో కోకాపేట ఏరియాలో భూముల విలువ రూ.100 కోట్లు పలుకుతున్నాయని వివరించారు. అందుకే ఆదిభట్ల వద్ద ఫ్యూచర్ సిటీ నిర్మాణానికి తమ ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని వ్యాఖ్యానించారు. తమ ప్రభుత్వం స్కిల్ యూనివర్సిటీని ఏర్పాటు చేస్తోందని తెలిపారు. ఇప్పుడు ఇంజనీరింగ్ పూర్తయిన విద్యార్థుల్లో స్కిల్స్ ఉండటం లేదని... వారికి పలు అంశాలపై అవగాహన కల్పించేలా తమ ప్రభుత్వం కార్యక్రమాలు చేపడుతోందని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి పేర్కొన్నారు

-----------

## దేవాలయాల సంపద దేవుడిదే..

(మొదటి పేజీ తరువాయి)

సర్వోన్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. ఈ విషయంలో కేరళ హైకోర్టు ఇచ్చిన తీర్పును సమర్థిస్తూ ఈ ఆదేశాలు జారీ చేసింది.దేవాలయానికి చెందిన డిపాజిట్లను తిరిగి చెల్లించాలని కేరళ హైకోర్టు ఆదేశించడాన్ని సవాలు చేస్తూ అక్కడి సహకార బ్యాంకులు సుప్రీంకోర్టును ఆశ్రయించాయి. ఈ పిటిషన్‌పై జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం విచారణ చేపట్టింది. విచారణ సందర్భంగా కేరళ హైకోర్టు తీర్పులో ఎలాంటి పొరపాటు లేదని ధర్మాసనం అభిప్రాయపడింది.ఈ సందర్భంగా జస్టిస్ సూర్యకాంత్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. "సహకార బ్యాంకులను కాపాడటానికి గుడి డబ్బును ఉపయోగిస్తారా? దేవుడి డబ్బు కేవలం ఆలయ ప్రయోజనాల కోసమే వాడాలి. అది బ్యాంకులకు ఆదాయ మార్గం కాకూడదు" అని ఆయన అన్నారు. కస్టమర్ల నుంచి డిపాజిట్లు రాబట్టుకోలేకపోవడం అనేది సహకార బ్యాంకుల సమస్య... అందుకు దేవుడి సొమ్మును వాడటం సరికాదని హితవు పలికారు.ప్రజల నుంచి నమ్మకాన్ని పొందడంలో బ్యాంకులు విఫలమైతే అది వాటి సమస్యేనని పేర్కొంటూ, సహకార బ్యాంకుల పిటిషన్‌ను సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. దేవాలయాల డిపాజిట్లను తిరిగి ఇవ్వాల్సిందేనని స్పష్టం చేస్తూ కేరళ హైకోర్టు తీర్పును సమర్థించింది.

## వాహన, గృహ రుణదారులకు ఊరట..

(మొదటి పేజీ తరువాయి)

ఈ మేరకు ఏకగ్రీవంగా నిర్ణయం తీసుకున్నారు. ఈ తగ్గింపుతో రెపో రేటు 5.5 శాతం నుంచి 5.25 శాతానికి తగ్గింది.ఈ సందర్భంగా గవర్నర్ సంజయ్ మల్హోత్రా మాట్లాడుతూ.. ఆర్థిక వ్యవస్థలో నగదు లభ్యతను పెంచేందుకు మరిన్ని చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఓపెన్ మార్కెట్ ఆపరేషన్ల ద్వారా లక్ష కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ సెక్యూరిటీలను కొనుగోలు చేయనున్నట్లు వెల్లడించారు. దీనికి అదనంగా 5 బిలియన్ డాలర్ల విలువైన డాలర్-రూపాయి స్వాప్ ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు.
ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో ఆర్థిక వృద్ధి 8.2 శాతానికి చేరడం, ద్రవ్యోల్బణం 1.7 శాతానికి పడిపోవడం భారత ఆర్థిక వ్యవస్థకు 'గోల్డెన్ పీరియడ్' అని ఆయన అభివర్ణించారు. ద్రవ్యోల్బణం అదుపులో ఉండటం వల్లే వృద్ధికి మద్దతుగా వడ్డీ రేట్ల కోతకు అవకాశం లభించిందని వివరించారు. ఈ సానుకూల పరిణామాల నేపథ్యంలో దేశ జీడీపీ వృద్ధి అంచనాను కూడా 6.8 శాతం నుంచి 7.3 శాతానికి పెంచుతున్నట్లు ఆర్‌బీఐ ప్రకటించింది.ద్రవ్య విధానంలో తటస్థ వైఖరిని కొనసాగించాలని నిర్ణయించినట్లు మల్హోత్రా స్పష్టం చేశారు. ఆగస్టు, అక్టోబర్ నెలల్లో జరిగిన సమీక్షల్లో ద్రవ్యోల్బణాన్ని దృష్టిలో ఉంచుకుని వడ్డీ రేట్లలో ఎలాంటి మార్పు చేయలేదని గుర్తుచేశారు. దేశ విదేశీ మారక నిల్వలు 686 బిలియన్ డాలర్ల రికార్డు స్థాయికి చేరాయని, ఇది 11 నెలల దిగుమతులకు సరిపోతుందని తెలిపారు. అయితే, ప్రపంచ వాణిజ్య అనిశ్చితి, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు ఆర్థిక వ్యవస్థకు ప్రతికూల అంశాలుగా కొనసాగుతున్నాయని హెచ్చరించారు.ఆర్‌బీఐ వడ్డీ రేట్లను తగ్గించడం వల్ల బ్యాంకులు కూడా రుణాలపై వడ్డీ రేట్లను తగ్గించే అవకాశం ఉంది. అయితే, ఈ ప్రయోజనాలను వాణిజ్య బ్యాంకులు ఎంత వేగంగా వినియోగదారులకు అందిస్తాయన్న దానిపైనే అసలైన ఫలితం ఆధారపడి ఉంటుంది.

## ఏపీలో యూనివర్సల్ హెల్త్ పాలసీ..

(మొదటి పేజీ తరువాయి)

అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా ఎన్టీఆర్ వైద్య సేవ - ఏబీపీఎంజేఏవై పథకాన్ని హైబ్రిడ్ మోడ్‌లో అమలు చేయడానికి టెండర్లను ఆహ్వానించింది.ఆంధ్రప్రదేశ్ వైద్యారోగ్య-కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శి సౌరభ్ గౌర్ గురువారం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ విధానం ప్రకారం, వార్షికాదాయం రూ. 5 లక్షలలోపు ఉన్న నిరుపేద కుటుంబాలకు రూ. 2.50 లక్షల వరకు ఇన్సూరెన్స్ మోడ్‌లో వైద్యం అందిస్తారు. ఒకవేళ వైద్య ఖర్చులు ఆ పరిమితి దాటితే, రూ. 25 లక్షల వరకు అయ్యే అదనపు ఖర్చును ఎన్టీఆర్ వైద్యసేవ ట్రస్ట్ భరిస్తుంది. దారిద్ర్య రేఖకు ఎగువన ఉన్న (ఏపీఎల్) కుటుంబాలకు రూ. 2.50 లక్షల వరకు ఇన్సూరెన్స్ వర్తిస్తుంది.ఈ పథకం అమలు కోసం టెండర్ నిబంధనలలో ప్రభుత్వం కొన్ని కీలక సవరణలు చేసింది. ఇన్సూరెన్స్ క్లెయిమ్ రేషియో 120 శాతం దాటితే, ప్రీమియంకు మించిన అదనపు ఖర్చును ట్రస్ట్, బీమా కంపెనీ చెరి సగం భరిస్తాయి. ప్రభుత్వ ఆసుపత్రులలో అందించే 521 రకాల ప్రత్యేక సేవలకు అయ్యే ఖర్చును ముందుగా బీమా కంపెనీ చెల్లించి, ఆ తర్వాత ట్రస్ట్ నుంచి రీయింబర్స్‌మెంట్ పొందుతుంది.ఎంప్లాయీస్ హెల్త్ స్కీమ్ (ఈహెచ్ఎస్), వర్కింగ్ జర్నలిస్ట్ స్కీమ్ మినహా రాష్ట్రంలోని మిగిలిన అన్ని కుటుంబాలు ఈ పాలసీకి అర్హులు. ఇప్పటికే పీఎంజేఏవై, ఎన్టీఆర్ వైద్యసేవ లబ్ధిదారులు కూడా ఇందులో చేరవచ్చు. ఈ యూనివర్సల్ హెల్త్ పాలసీ ద్వారా రాష్ట్రంలోని సుమారు 1.63 కోట్ల కుటుంబాలకు ప్రయోజనం చేకూరనుందని ప్రభుత్వం అంచనా వేస్తోంది.

# రాష్ట్రం కోసం ఎన్ని సార్లయినా ఢిల్లీ వెళతా

(మొదటి పేజీ తరువాయి)

రాకపోతే కొట్లాడటానికి అసలే భయపడను. కావలసిన నిధులు, రావలసిన అనుమతుల కోసం ప్రధానమంత్రి, కేంద్ర మంత్రుల వద్దకు వెళ్లి అడగడం ముఖ్యమంత్రిగా నా బాధ్యత అన్నారు. ఒకటికి వంద సార్లు తిరుగుతా. నాకు ఓపిక ఉంది. వయసుంది. విషయాన్ని వివరించే కనీస పరిజ్ఞానం నాకుందని సిఎం రేవంత్ అన్నారు. ప్రజాపాలన ప్రజా విజయోత్సవాలు కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం వరంగల్ జిల్లా నర్సంపేట బహిరంగ సభలో ముఖ్యమంత్రి మాట్లాడారు. కాకతీయ కాలం నుంచి ప్రపంచానికి పోరాట పంథాను చాటిచెప్పిన వరంగల్ గడ్డ, సమ్మక్క-సారలమ్మ, చాకలి ఐలమ్మ, దొడ్డి కొమురయ్య, దాశరథి కృష్ణమాచార్యులు, కాళోజీ నారాయణ రావు, పీవీ నర్సింహారావు నుంచి తెలంగాణ మలిదశ ఉద్యమానికి నాయకత్వం వహించిన ప్రొ జయశంకర్ ప్రజా ప్రభుత్వానికి స్ఫూర్తిగా నిలుస్తారు. వారి స్ఫూర్తిగానే ప్రభుత్వం పనిచేస్తోందని చెప్పారు. నిరుపేదలు, దళిత, గిరిజన, ఆదివాసీ, మైనారిటీ పిల్లలు చదువుకుంటేనే భవిష్యత్తు ఉంటుంది. అవసరమైన సౌకర్యాలు కల్పించి నాణ్యమైన చదువులు అందించే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుంది. తాతముత్తాల కాలం పది తరాలుగా వృత్తులు చేసుకుంటూ వచ్చినా బతుకులు మారలేదు. చదువొక్కటే మన బతుకుల్లో మార్పు తీసుకొస్తుంది. నిలబెడుతుంది. ప్రపంచంతో పోటీ పడేలా చేస్తుంది. ప్రజా ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత అనేక సామాజిక అంశాలను పరిగణలోకి తీసుకుని.. ఒకవైపు రైతులు, మరోవైపు మహిళలు, ఇంకోవైపు యువత కోసం కార్యక్రమాలు చేపట్టింది. యువత కోసం ఉద్యోగ నియాకాలు చేపట్టాం. అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాది లోపే 61 వేల ఉద్యోగాలిచ్చాం. ఇంకా 40 వేల ఉద్యోగాలిచ్చే పక్రియ మొదలవుతుంది. అభివృద్ధిపథంలో సాగాలంటే ఎడ్యుకేషన్,ఇరిగేషన్,కమ్యునికేషన్ అత్యంత కీలకమని, ఆయా రంగాల్లో లక్ష్యాలను సాధించడానికి ఈ నెల 8, 9, తేదీల్లో ప్రపంచ స్థాయిలో తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌ను నిర్వహిస్తున్నాం అని వివరించారు. హైదరాబాద్‌తో సమంగా వరంగల్‌ను అభివృద్ధి చేయాలి. పక్క రాష్ట్రాల్లో( నాలుగైదు విమానాశ్రయాలుంటే, తెలంగాణలో ఒక్కటి మాత్రమే ఉంది. పదేండ్లలో వీటి గురించి పట్టించుకోలేదు. కనీసం రోడ్లు వేయలేదు. డిసెంబర్ ఆఖరునాటికి భూ సేకరణ పూర్తి చేసి మార్చి 31 లోపు వరంగల్ విమానాశ్రయ పనులు ప్రారంభిస్తాం అన్నారు. వందల సంవత్సరాల చరిత్ర కలిగిన సమ్మక్క, సారలమ్మ మందిరం అద్భుతంగా నిర్మాణమవుతోందని, అదే తరహాలో వరంగల్‌ను అభివృద్ధి చేస్తాం. తాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేస్తాం అన్నారు. రాష్ట్రంలో ప్రతి మారుమూల తండాకు రోడ్డు కనెక్టివిటీ ఉండాలన్న లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని, రాష్ట్రంలో ఏ గ్రామానికీ రోడ్డు లేదన్న మాట వినదలచుకోలేదని అన్నారు. రోడ్లు, భవనాల శాఖ, పంచాయతీ రాజ్ శాఖ ఆధ్వర్యంలో 20 వేల కోట్లు వెచ్చించి రోడ్లు నిర్మిస్తున్నాం. ప్రతి గూడెం నుంచి మండల కేంద్రానికి, ప్రతి మండల కేంద్రం నుంచి జిల్లా కేంద్రానికి రెండు వరుసలు, జిల్లా కేంద్రం నుంచి రాజధానికి నాలుగు వరుసల రోడ్లు వేస్తున్నాం. రాష్ట్రంలో కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలన్న సంకల్పంతో మహిళాభ్యున్నతి కోసం అనేక కార్యక్రమాలు చేపట్టాం. ఉచిత బస్సు సౌకర్యం, సంఘాలకు వడ్డీ లేని రుణాలు, సోలార్ విద్యుత్ ప్లాంట్లు, పెట్రోల్ బంకులు, ఉత్పత్తుల విక్రయానికి శిల్పారామంలో ఇందిరా మహిళా శక్తి బజార్, బస్సులకు యజమానులుగా.. ఇలా అనేక పథకాలు అమలు చేస్తున్నాం అన్నారు. ఇంటి ఆడబిడ్డకు చీరె పెట్టడం ఒక సంప్రదాయం. ఇంట్లో సొంత సోదరుడి తరహాలో ప్రతి ఏటా సారె పండుగ చేసుకోవాలని గ్రామీణ ప్రాంతాల్లో 65 లక్షల మంది ఆడబిడ్డలకు చీర అందిస్తున్నాం. రాష్ట్రంలో 18 సంవత్సరాలు పైబడిన ప్రతి ఆడబిడ్డకు చీరె చేరాలి. రాష్ట్రంలో ఏ ఒక్క ఆడబిడ్డ కూడా నాకు చీర రాలేదని అనొద్దు. గ్రామీణ ప్రాంతాల్లో పూర్తయ్యాక, మార్చిలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా పట్టణ, మున్సిపాలిటీల్లో చీరె అందజేస్తాం. ప్రతి పేదవారికి సంక్షేమ పథకాలు అందాలన్న లక్ష్యంతో ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేస్తోందన్నారు.

# విదేశీ విద్యకు భరోసా 'కలలకురెక్కలు'

(మొదటి పేజీ తరువాయి)

లోకేశ్ కోసం తాను ఎప్పుడూ స్కూలుకు వెళ్లలేదని చెప్పుకొచ్చారు. ఏపీ విద్యశాఖలో నూతన ఒరవడి సృష్టిస్తానని లోకేశ్ అన్నారని.. ఈ విషయంలో తాను ఆశీర్వదించానని పేర్కొన్నారు. ఏపీ వ్యాప్తంగా పేరెంట్ టీచర్స్ మీటింగ్స్‌ను శుక్రవారం నిర్వహించారు. మన్యం జిల్లా బామినిలో జరిగిన కార్యక్రమంలో సీఎం చంద్రబాబు పాల్గొని ప్రసంగించారు. తమ ప్రభుత్వంలో అత్యాధునిక విద్యను అందించడానికి కృషి చేస్తున్నామని వ్యాఖ్యానించారు. ఆ దిశగా ఉపాధ్యాయుల్లో నైపుణ్యాలు పెంపొందించ డానికి విదేశాల్లో శిక్షణ ఇస్తున్నామని వివరించారు. వారి ద్వారా దశల వారిగా.. ఉపాధ్యాయులు అందరికీ.. ప్రపంచ స్థాయి విద్యపై శిక్షణ ఇస్తామని తెలిపారు. గతంలో ఉపాధ్యాయులను అనేక వేధింపులకు గురి చేశారని ప్రస్తావించారు. కూటమి ప్రభుత్వంలో ప్రభుత్వ ఉపాధ్యాయులను గౌరవించడమే ప్రథమ కర్తవ్యంగా పెట్టుకున్నామని పేర్కొన్నారు. ఉపాధ్యాయులను గౌరవించటంతో పాటు పిల్లలను ఉన్నతంగా తీర్చిదిద్దుతామని వ్యాఖ్యానించారు సీఎం చంద్రబాబు. కేంద్రంలో వికసిత్ భారత్ తీసుకువస్తే రాష్ట్రంలో స్వర్ణాంధ్రా నినాదంతో ముందుకెళ్తున్నామని తెలిపారు. భవిష్యత్‌లో పిల్లలు, ఉద్యోగాలు చేసే స్థాయి నుంచి, ఉద్యోగాలు కల్పించే స్థాయికి చేరుతారని తాను ఆశిస్తున్నానని పేర్కొన్నారు సీఎం చంద్రబాబు. మన్యం జిల్లా కలెక్టర్ ప్రభాకర్ రెడ్డి జిల్లాలోని ప్రభుత్వ విద్యాసంస్థల్లో వినూత్నమైన మార్పులు చేయడం అభినందనీయమని ప్రశంసించారు. ముస్తాబు కార్యక్రమాన్ని కలెక్టర్ ప్రభాకర్ రెడ్డి తీసుకువచ్చారని కొనియాడారు. ముస్తాబు కార్యక్రమాన్ని రాష్ట్రంలో అన్ని పాఠశాలలు, కళాశాలల్లో తీసుకువచ్చేందుకు ప్రయత్నిస్తున్నామని తెలిపారు. విద్యార్థులు ప్రస్తుతం వినూత్నమైన ఆలోచనలతో ముందుకెళ్తున్నారని.. నూతన ఆవిష్కరణలు రూపొందిస్తున్నారని ప్రశంసించారు. ఈ ఏడాది జనవరిలో స్టూడెంట్ ఇన్నోవేషన్ సమ్మిట్ నిర్వహిస్తామని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. విద్యార్థులు నైతిక విలువలు అలవర్చుకోవాలని రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ సూచించారు. పిల్లలు అంటే తనకు చాలా ఇష్టమని.. అందుకే సీఎం చంద్రబాబును అడిగి విద్యాశాఖను తీసుకున్నానని ప్రస్తావించారు. తనకు పేరెంట్స్ మీటింగ్స్ అంటే చాలా భయమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆంధ్రకేసరి విద్యార్థి దశను ప్రస్తావించారు. అలాగే, శ్రీకాకుళం జిల్లా రచయిత కారా మాస్టరు (కాళీపట్నం రామారావు) సేవలను కొనియాడారు. తాను చదువుకున్నప్పుడు ఎప్పుడూ తన తల్లిదండ్రులు పేరెంట్స్ మీటింగ్‌కు రాలేదని చెప్పుకొచ్చారు. పిల్లలు, తల్లిదండ్రుల త్యాగాలను మరవకూడదని సూచించారు. తల్లి ప్రేమ, తండ్రి త్యాగం ఎంతో గొప్పదని చెప్పుకొచ్చారు. తల్లికి చెప్పలేని ఏ పని కూడా చేయకూడదని సూచించారు. మహిళలను గౌరవించాల్సిన బాధ్యత అందరిపై ఉందని తెలిపారు మంత్రి నారా లోకేశ్. పాఠ్యపుస్తకాల్లోనూ.. కవర్ పేజీల్లో ఎక్కడ కూడా మహిళలు ఇంటి పని చేస్తున్న చిత్రాలు ప్రచురించకుండా తగ్గించామని చెప్పుకొచ్చారు. 906 పాఠశాలల్లో అనేక విద్యా సంస్కరణలు తీసుకువచ్చామని వివరించారు. ఉపాధ్యాయుల బదిలీల్లో పారదర్శకత తీసుకువచ్చామని పేర్కొన్నారు. లీప్ యాప్ ద్వారా పిల్లల ప్రగతి, హాజరు, ఇతర విషయాలన్నీ తల్లిదండ్రులు తెలుసుకునే సదుపాయం కల్పించామని వివరించారు. 2029 నాటికి ఏపీలో విద్యావ్యవస్థను దేశంలోనే ప్రథమ స్థానానికి తీసుకువస్తానని మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు.

## చదువుకు మీడియం అడ్డంకి కాదు

(మొదటి పేజీ తరువాయి)

అబ్దుల్ కలాం వంటి వారు తమిళ మాధ్యమంలో చదివి మిసైల్ మ్యాన్‌గా, రాష్ట్రపతిగా ఎదిగారని గుర్తుచేశారు. చిలకలూరిపేట ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల సమావేశంలో పవన్ కళ్యాణ్ మాట్లాడారు. కూటమి ప్రభుత్వంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల సమావేశానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. ఇలాంటి సమావేశాలు నిర్వహించాలన్న మంత్రి లోకేష్ ఆలోచన అద్భుతమని డిప్యూటీ సీఎం ప్రసంసించారు. మైలవరపు కృష్ణ తేజ తాతగారు గుండయ్య పేరుతో కూడలి ఉండటం ఆయన సేవా నిరతిని గుర్తు చేసిందన్నారు. అప్పట్లో పెద్దలు పాఠశాలలకు స్థలాలు ఇచ్చేవారని, కానీ ఇప్పుడు కొందరు స్థలాలు లాక్కుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.ఈ క్రమంలోనే పవన్ కళ్యాణ్ పలు కీలక విషయాల గురించి మాట్లాడారు. పిఠాపురంలో విద్యార్థుల మధ్య చిన్న గొడవను కులాలకు అంటగట్టారని మండిపడ్డారు. కేరళలో తల్లిదండ్రుల సంఘాలు చాలా బలంగా ఉంటాయని, క్రియాశీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. గ్రంధాలయంలో పిల్లల సంఖ్యకు సరిపడా పుస్తకాలు లేవని, తన వైపు నుంచి పూర్తి స్థాయి గ్రంథాలయం ఏర్పాటు చేసి పుస్తకాలు అందిస్తానని డిప్యూటీ సీఎం హామీ ఇచ్చారు. పిల్లల ఆలోచనలు మెరుగు పర్చటానికి లైబ్రరీ ఎంతో అవసరమని, ప్రభుత్వ పాఠశాలల్లో గ్రంధాలయాల ఏర్పాటుకు జనసేన నేతలు, కార్యకర్తలు చేయూత అందించాలని కోరారు. పాఠశాలలో పది కంప్యూటర్లు మాత్రమే ఉన్నాయని, తన వైపు నుంచి 25 కంప్యూటర్లు పంపిస్తానని స్పష్టం చేశారు. బాలికలకు ఆత్మరక్షణ విద్య చాలా ముఖ్యమన్నారు. మధ్యాహ్న భోజన




పథకంలో పౌష్టికాహారం చాలా అవసరమని వివరించారు. చిన్నప్పుడు సోషల్ టీచర్ చెప్పిన అంశాలు తనన్ను ఇప్పుడు బలంగా నిలబెట్టాయన్నారు. విద్యార్థులను భవిష్యత్తు కోసం తయారు చేసే బాధ్యత ఉపాధ్యాయులదేనని పేర్కొన్నారు.మన జీవితాలను మార్చిన శాస్త్రవేత్తలను గుర్తు పెట్టుకుని గౌరవించటం తన తల్లి నుంచి నేర్చుకున్నట్లు తెలిపారు. ప్రతి విద్యార్థిలోనూ నిగూఢమైన శక్తి ఉంటుందని వ్యాఖ్యానించారు.

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక
శనివారం 6 డిసెంబర్ 2025

# పరహితమే పరమధర్మము.

**డాక్టర్ మల్లు వేంకట రెడ్డి, తి.తి.దే. -గోపూజతో ముగిసిన తితిదే ధార్మిక కార్యక్రమాలు.**



**ఆంధ్ర ప్రగతి నందికొట్కూరు డిసెంబర్ 05:**
పరహితము పరమ ధర్మమని, అది హైందవ జీవన సారమని, అటువంటి హైందవధర్మాన్ని అందరూ తెలుసుకొని ఆచరించినప్పుడే దేశం సుభిక్షంగా ఉంటుందని తిరుమల తిరుపతి దేవస్థానంలో హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ కార్యనిర్వాకులు డాక్టర్ మల్లు వేంకటరెడ్డి అన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ ఆధ్వర్యంలో మిడుతూరు మండలం, నాగలూటి గ్రామంలోని శ్రీ ఆంజనేయస్వామి దేవస్థానంనందు గత నాలుగు రోజులుగా జరుగుతున్న ధార్మిక, ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా శుక్రవారం మహిళలందరితో వేదపండితులు సురేశ్ శర్మ కుంకుమార్చనతో పాటు ముక్కోటి దేవతా స్వరూపమైన గోమాతకు పూజలు చేయించి, ఊరేగించారు. ఆలయ కమిటీ మరియు గ్రామ పెద్దలు ఊరందరికీ షడ్రుచోపేతమైన మహా ప్రసాదాన్ని అందించారు. మూడు రోజులు పాటు స్థానిక భజన మండలి చేసిన భజనలు, గరుడాద్రి వనజ కుమారి శ్రీమద్రామాయణం, మహాభారతం, భగవద్గీతలపై చేసిన ధార్మిక ప్రవచనాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఆలయకమిటీ చైర్మన్ సర్వేశ్వర రెడ్డి, గ్రామ సర్పంచ్ టి.ఉషారాణి, చిన్న పుల్లారెడ్డి, మాజీ సింగిల్ విండో చైర్మన్ తులసిరెడ్డి, నాగిరెడ్డి, బి. ఎల్లారెడ్డి, టి.వెంకట రమణారెడ్డి, టి. వెంకటరెడ్డి, బి. రమణారెడ్డి, నీలకంఠేశ్వరప్ప, రాంభూపాల్ రెడ్డి, చిన్న ఎల్లారెడ్డి, కట్టా నాగిరెడ్డి, బి. రవీంద్రారెడ్డి, కె.మల్లికార్జున్ రెడ్డి, విశ్రాంత జిల్లా వైద్యాధికారి డాక్టర్ పూజారి మోక్షేశ్వరుడు, ధర్మ ప్రచార మండలి సభ్యులు ఎ.శివశంకర్ రెడ్డి, టి.అబ్దుల్ కరీంతోపాటు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



# శ్రీశైలం డ్యాంకు పొంచి ఉన్న పెను ప్రమాదం..?

**డ్యాం దిగువన 45 మీటర్ల లోతైన భారీ గొయ్యి గుర్తింపు.**

**గాల్లో వేలాడుతున్న డ్యాం అప్రాన్.**

**తక్షణమే మరమ్మతులు చేపట్టాలని నిపుణుల కమిటీ సిఫార్సు.**



**ఆంధ్ర ప్రగతి శ్రీశైలం డిసెంబర్ 05:**
కృష్ణానదిపై నిర్మించిన శ్రీశైలం డ్యాం భద్రతకు పెను ముప్పు పొంచి ఉందని నిపుణుల కమిటీ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. డ్యాం దిగువన ప్లంజ్‌పూల్‌లో భారీ గొయ్యి ఏర్పడటంతో ఆనకట్ట భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని హెచ్చరించింది. ఈ ఏడాది జూన్‌లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నియమించిన నిపుణుల కమిటీ, తాజాగా నిర్వహించిన అండర్ వాటర్ పరిశీలన అనంతరం తన నివేదికను ప్రభుత్వానికి సమర్పించింది.
డ్యాం నుంచి విడుదలయ్యే నీటి ప్రవాహ వేగానికి ప్లంజ్‌పూల్‌లో 35 నుంచి 45 మీటర్ల లోతైన గొయ్యి ఏర్పడినట్లు కమిటీ గుర్తించింది. డ్యాం అప్రాన్ (కాంక్రీట్ పునాది) ముగిసిన 15 మీటర్ల తర్వాత మొదలైన ఈ గొయ్యి, సుమారు 150 మీటర్ల వరకు విస్తరించింది. దీనివల్ల డ్యాం అప్రాన్‌కు తీవ్ర ముప్పు వాటిల్లింది. అప్రాన్ కింద 4 మీటర్ల లోతైన రంధ్రం ఏర్పడి, అది డ్యాం వైపు 14-15 మీటర్ల వరకు విస్తరించింది. దీంతో అప్రాన్‌లోని సగభాగం ఎలాంటి ఆధారం లేకుండా గాల్లో వేలాడుతున్నట్లు నిపుణులు తేల్చిచెప్పారు.
డ్యాం పునాదుల కంటే ఎక్కువ లోతులో ఈ గొయ్యి ఉండటం అత్యంత ఆందోళన కలిగించే విషయం. 2018లో నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఓషనోగ్రఫీ అధ్యయనంలో గొయ్యి లోతు 32 మీటర్లు ఉండగా, ఇప్పుడు అది 45 మీటర్లకు చేరడం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తోంది. అప్రాన్ రక్షణ కోసం ఏర్పాటు చేసిన 62 స్టీల్ సిలిండర్లలో చాలావరకు దెబ్బతిన్నాయని, ఐదు సిలిండర్లు ఇప్పటికే వరదల్లో కొట్టుకుపోయాయని నివేదికలో పేర్కొన్నారు.
విశాఖకు చెందిన సీలైన్ ఆఫ్‌షోర్ డైవింగ్ సంస్థ సహకారంతో జరిగిన ఈ అధ్యయనం తర్వాత, డ్యాంకు తక్షణమే మరమ్మతులు చేపట్టాలని నిపుణుల కమిటీ గట్టిగా సిఫార్సు చేసింది. ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకుని అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించింది.

## పోలీసు సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ పోలీస్ సంక్షేమ దివస్ ఏర్పాటు.

**- జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్.**



**ఆంధ్ర ప్రగతి నంద్యాల క్రైమ్ డిసెంబర్ 05:**నంద్యాల జిల్లా పోలీసు సిబ్బంది సంక్షేమానికి మరియు వృత్తి పరమైన సమస్యల పరిష్కారం కొరకు "పోలీస్ సంక్షేమ దివస్"ను నేడు నంద్యాల జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా పోలీస్ కార్యాలయానికి వచ్చిన పోలీసు సిబ్బంది నుండి ఎస్పీ స్వయంగా వినతులను స్వీకరించి, వారి సమస్యలను సమగ్రంగా విచారించి వాటిపై తగు పరిష్కార చర్యలు తీసుకుంటామని సిబ్బందికి భరోసా కల్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ గారు మాట్లాడుతూ విధి నిర్వహణలో నిమగ్నమైన సిబ్బంది యొక్క సంక్షేమానికి అధిక ప్రాధాన్యతనిస్తూ,పోలీస్ వెల్ఫేర్ డే కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని సిబ్బంది సమస్యలపై సత్వర చర్యలు తీసుకోని పరిష్కరిస్తున్నామన్నారు. పోలీసు విధులలో సిబ్బంది ఇబ్బంది పడకుండా వారి సమస్యల తొలగించి ప్రజలకు మెరుగైన సేవలు అందించేలా చెయ్యటమే లక్ష్యమని తెలియజేశారు.

## రాష్ట్రపతి ని కలిసిన ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి దంపతులు.



**ఆంధ్ర ప్రగతి నంద్యాల జిల్లా డిసెంబర్ 05:**
భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ను న్యూ ఢిల్లీలో శుక్రవారం రాష్ట్రపతి భవనంలో నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ డాక్టర్ బైరెడ్డి శబరి, ఆమె భర్త డాక్టర్ శివ చరణ్ రెడ్డి లు మర్యాద పూర్వకంగా కలిచారు. దేశ సేవలో కీలకమైన బాధ్యతలు నిర్వహిస్తున్న భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సాధ సిధాగా, వ్యక్తిత్వం, వినయంతో కూడిన ఆమె ఆప్యాయత పలకరింపు మాకు ఎంతో ప్రేరణ ఇచ్చాయని ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి దంపతులు అన్నారు.

## విలువలతో కూడిన విద్య

**ఉన్నత శిఖరాలకు చేరుస్తుంది- హెచ్ఎం ఆర్ జానకి.**





**ఆంధ్ర ప్రగతి శిరివెళ్ల డిసెంబర్ 05:**
విద్యార్థి దశలో విలువలతో కూడిన విద్యను అందిస్తే వారిని ఉన్నత శిఖరాల వైపు తీసుకు వెళుతుందని వీరారెడ్డి పల్లె గ్రామంలో గల జిల్లా పరిషత్ హై స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు ఆర్ జానకి పిలుపునిచ్చారు. వీరారెడ్డిపల్లె జిల్లా పరిషత్ హై స్కూల్ లో మెగా పేరెంట్స్ మరియు టీచర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందరరేగా హెచ్ఎం జానకి మాట్లాడుతూ క ృషి పట్టుదలతో క ృషి పట్టుదలతో ఉన్నత శిఖరాలే లక్ష్యంగా ఉద్యమ కొలువులే ధ్యేయంగా కష్టపడి చదవాలని విద్యార్థులకు సూచించారు. హై స్కూల్ క్రీడా మైదానంలో నిర్వహించిన పలు క్రీడా సాంస్క ృతిక కార్యక్రమాలతో విద్యార్థులు అలరించారు. ప్రతిభ చాటిన చిన్నారులకు ప్రోత్సాహక బహుమతులు అందించి హెచ్ఎం అభినందించారు. ఉపాధ్యాయులు మధుసూదన్ రెడ్డి రాజశేఖర్ యాగంటి ఈశ్వరుడు ప్రభాకర్ లింగమయ్య మరియు విద్యార్థిని విద్యార్థుల తల్లిదండ్రులు ప్రముఖులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

# నంద్యాలలో విచ్చలవిడిగా గుట్కాపాన్ మసాలాలు విక్రయాలు

**...అనుమతులు ఉన్నాయా...అనుమతులు లేవా. ...కోట్లల్లో గుట్కా వ్యాపారం.**

**...గుట్కాపాన్ మసాలలకు అలవాటు పడుతున్న యువత. -.నంద్యాలలో బహిరంగ విక్రయాలు.**

**ఆంధ్ర ప్రగతి నంద్యాల డిసెంబర్ 05:**
నంద్యాల పట్టణం లో గుట్కా,పాన్ మసాలాలు బహిరంగానే విక్రయాలు జరుగుతున్నాయి.యువత వీటిని తింటూ అనారోగ్యాల బారిన పడుతున్నారు.గుట్కా విక్రయాలకు ప్రభుత్వ అనుమతులు ఉన్నాయని కొందరు వ్యాపారస్తులు చెప్పుకుంటూ బహిరంగంగానే విక్రయాలు సాగిస్తున్నారు.నంద్యాల నియోజకవర్గంలో కోట్లాది రూపాయల వ్యాపారం సాగుతున్నట్టు తెలుస్తోంది.పోలీస్,ఫుడ్, తూనికలు,కొలతలు, విజిలెన్స్ అధికారులు గతంలో తనికీలు చేపట్టి గుట్కా విక్రయాలు చేస్తున్న వారిపై కేసులు నమోదు చేసేవారు.గుట్కా,విమల్,రాజా ఖైనీ తో పాటు వివిధ రకాల ఉత్పత్తులు మార్కెట్లో బహిరంగంగానే వ్యాపారాలు సాగుతున్నాయి.గతంలో గుట్టుగా వ్యాపారాలు సాగించే వ్యాపారులు దాడులు,కేసులు పెట్టకపోవడంతో బహిరంగంగానే విక్రయాలు సాగిస్తున్నాయి. తెలంగాణ ప్రాంతంలో ఫుడ్ సేఫ్టీ అధికారులకు అప్పగించడంతో గుట్కా విక్రయాలపై తనికీలు నిర్వహించి కేసులు నమోదు చేస్తున్నారు.నంద్యాలలో గుట్కా




విక్రయాలపై దాడులు లేకపోవడంతో వ్యాపారులకు కలిసివస్తుంది.నంద్యాలలో అయిదు మంది హోల్సేల్ వ్యాపారులు ఇతర రాష్ట్రాల నుంచి సరకు తెప్పించుకుంటున్నట్టు తెలుస్తోంది.ప్రస్తుత యుగంలో యువతకు ఫ్యాషన్ గా మారిపోయింది.యువత అధిక సంక్య వీటిని తినడం వల్ల వ్యాపారాలు కోట్లు దాటుతున్నాయి.యువత గుట్కా,పాన్ మసాలాలు,మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ప్రచారాలు చేస్తున్న సంబంధిత అధికారులు ఎవరికి వర్తిస్తుంది అర్థం కాక పోవడంతో వ్యాపారాలు మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతుంది.చిన్న,చిన్న బడ్డీ కోట్ల లో సైతం దొరుకుతున్నాయి.సినీనటులు సైతం గుట్కా లపై ప్రచారం చేస్తుండడంతో ప్రభుత్వ అనుమతులు ఇచ్చారని కొందరు వ్యాపారస్తులు బహిరంగంగా వ్యాపారాలు చేస్తున్నారు.ప్రభుత్వం వారి ఆదాయం కంటే ప్రజల ఆరోగ్యం ను దృష్టిలో పెట్టుకొని గుట్కా వ్యాపారులపై కొరడా జులిపించాలని ప్రజలు కోరుతున్నారు.ప్రభుత్వ అనుమతులు లేకపోతే దాడులు చేసి గుట్కా ను అరికడతారో లేదో వేచిచూద్దాం.

## ఉపాధ్యాయుల నిర్లక్ష్యం వల్ల విద్యార్థి చేతులు విరిగిన వైనం.

**ఆవేదన వ్యక్తం చేస్తున్న తల్లిదండ్రులు.**






**ఆంధ్ర ప్రగతి నంద్యాల జిల్లా డిసెంబర్ 05:**
నంద్యాల జిల్లా కొలిమిగుండ్ల కనకాద్రి పల్లె గ్రామంలోని జడ్.పి.హెచ్.ఎస్ హైస్కూల్ నందు 9వ తరగతి చదువుతున్న శివ %ూ/ా% మల్లయ్య అనే విద్యార్థి మరో విద్యార్థి ఉపాధ్యాయులు చూస్తుండగానే తోసుకున్నారని లో భాగంగా విద్యార్థి శివ ఎడమ చేయి రెండు చోట్ల విరిగింది వెంటనే తల్లిదండ్రులు తాడిపత్రి హాస్పిటల్ తీసుకెళ్లగా చేయి విరిగిందని ఆపరేషన్ చేయాలని తెలిపారు అన్నారు ఉపాధ్యాయుల పర్యవేక్షణలో ఉన్న విద్యార్థికి చేయి విరగడం అంటే ఉపాధ్యాయుల నిర్లక్ష్యమేనని ఉపాధ్యాయులపై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకొని విద్యార్థి శివకు న్యాయం చేయాలని తల్లిదండ్రులు జిల్లా ఉన్నతాధికారులను కోరారు.

# తల్లిదండ్రులు, గురువులు మెచ్చే స్థాయికి విద్యార్థులు ఎదగాలి.

ప్రతి అవకాశాన్ని అందిపుచ్చుకుని ముందుకు సాగాలి. -పిల్లల్లో పోటీతత్వం, నైపుణ్యాలు పెంపొందేలా చర్యలు.

పదవ తరగతి విద్యార్థులకు 100 రోజుల ప్రత్యేక బోధనా. జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి గణియా







**ఆంధ్ర ప్రగతి చాగలమర్రి/నంద్యాల, డిసెంబరు 05:**
విద్యార్థి దశ నుంచే చదువుపై ఆసక్తి, క్రమశిక్షణ పెంపొందించుకుంటే తల్లిదండ్రులు, గురువులు గర్వపడే స్థాయికి విద్యార్థులు ఎదగగలరని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అన్నారు. శుక్రవారం చాగలమర్రి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ 3.0 కార్యక్రమంలో కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల సమగ్ర అభివృద్ధి కోసం ప్రత్యేక శ్రద్ధతో మెగా పేరెంట్స్%-%టీచర్స్ సమావేశాలను నిర్వహిస్తోందన్నారు. ఈ సమావేశాల ద్వారా విద్యార్థుల విద్యా ప్రతిభ, క్రీడా నైపుణ్యాలు, ఉపాధ్యాయుల బోధనపై పిల్లలకు అర్థం అవుతున్న స్థాయిలను తల్లిదండ్రులకు విపులంగా వివరిస్తున్నామన్నారు. అదేవిధంగా హెూలిస్టిక్ ప్రోగ్రెస్ రిపోర్ట్ ను తల్లిదండ్రులకు అందించి, విద్యార్థుల పురోగతిని సమగ్రంగా అర్థం చేసుకునే అవకాశాన్ని కల్పిస్తున్నామన్నారు. పదవ తరగతి ఉన్నత విద్యకు పునాది కాబట్టి రాబోయే పరీక్షలను దృష్టిలో ఉంచుకుని 100 రోజుల ప్రత్యేక బోధనా ప్రణాళిక సిద్ధం చేసినట్టు తెలిపారు. చదువులో కొంత వెనుకబడిన విద్యార్థులను రైజింగ్ స్టార్స్ గా గుర్తించి వారికి ప్రత్యేక శిక్షణ అందిస్తున్నామన్నారు. అదనంగా అటల్ టింకరింగ్ ల్యాబ్‌లు, క్రీడలు మరియు ఇతర నైపుణ్య కార్యక్రమాల గురించి తల్లిదండ్రులకు వివరించినట్టు పేర్కొన్నారు. విద్యార్థులు ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ముందుకు సాగాలని సూచించారు. ఏ విషయంలోనైనా ముందుండాలనే తపన విద్యార్థుల్లో ఉండాలన్నారు. పోటీతత్వంతో నైపుణ్యాలను పెంపొందించుకోవాలని కలెక్టర్ సూచించారు. డొక్కా సీతమ్మ పథకం ద్వారా విద్యార్థులకు పోషకాహారంతో కూడిన నాణ్యమైన భోజనం అందిస్తున్నామని, అవసరమైతే తల్లిదండ్రుల సూచనల మేరకు మెనూలో మార్పులు కూడా చేస్తున్నామని కలెక్టర్ తెలిపారు. విద్యార్థులు విలువైన సమయాన్ని వృథా చేసుకోకుండా మొబైల్ ఫోన్ల వినియోగాన్ని తగ్గించేలా తల్లిదండ్రులు, గురువులు క్రమం తప్పకుండా అవగాహన కల్పించాలన్నారు. ప్రతి మాసం మూడవ శనివారం నిర్వహించే స్వచ్ఛఆంధ్ర %-% స్వర్ణఆంధ్ర కార్యక్రమాల ద్వారా పరిశుభ్రతపై విద్యార్థులకు అవగాహన పెంపొందించాలని కలెక్టర్ ఉపాధ్యాయులను సూచించారు.





### బాల్య వివాహాలపై కఠిన చర్యలు

పదవ తరగతి పరీక్షల్లో విఫలమైనా లేదా చదువు కొనసాగించడంలో ఇబ్బందులు వచ్చినా విద్యార్థినిలను బాల్య వివాహాల వైపు నెట్టకుండా, ఉన్నత విద్యను కొనసాగించేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని కలెక్టర్ సూచించారు. 18 సంవత్సరాల లోపు బాల్య వివాహాలు జరిగితే, అబ్బాయి%-%అమ్మాయి ఇద్దరి తల్లిదండ్రులపైనా ఎఫ్ఐఆర్ నమోదు చేసే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# సుబ్రహ్మణ్య స్వామి సన్నిధిలో ఘనంగా "సుబ్రహ్మణ్య లిఖిత్ శర్మ" జన్మదిన వేడుకలు..!

సుబ్రహ్మణ్య లిఖిత్ శర్మకు శ్రీ కొత్తూరు సుబ్బరాయుని ఆశీస్సులు..!



**ఆంధ్ర ప్రగతి ఎస్.కొత్తూరు/ పాణ్యం డిసెంబర్ 05:**
శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి సన్నిధిలో "సుబ్రహ్మణ్య లిఖిత్ శర్మ" జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించడం జరిగింది. నంద్యాల జిల్లా, పాణ్యం మండలం ఎస్.కొత్తూరు గ్రామంలో వెలిసిన ప్రముఖ శైవక్షేత్రం అయిన శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి సన్నిధిలో ఆలయ ప్రధాన అర్చకులు వీరయ్య శర్మ మనవుడు, సురేష్ శర్మ కుమారుడు సుబ్రహ్మణ్య లిఖిత్ శర్మ జన్మదిన వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి మరియు నాగలింగేశ్వర స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకములు, అర్చనలు, విశేష పూజలు నిర్వహించారు. అనంతరం చిఎం సుబ్రహ్మణ్య లిఖిత్ శర్మ మరియు కుటుంబ సభ్యులకు ఆశీర్వ మంటపం నందు వేద పండితుల చేత, వేద ఆశీర్వచనం కంకణ ధారణ చేసి, స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం కుటుంబ సభ్యులు, స్నేహితులు, పెద్దలు పలువురు సుబ్రహ్మణ్య లిఖిత్ శర్మకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేస్తూ... ఆయురారోగ్యాలతో సంతోషంగా ఉండాలని, భవిష్యత్తులో ఉన్నత అభివృద్ధిని సాధించాలని ఆకాంక్షిస్తూ సుబ్రహ్మణ్య లిఖిత్ శర్మకు శ్రీ వల్లీ దేవసేన సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దీవెనలు మెండుగా ఉండాలని కోరారు.

# బాలసదనంను సందర్శించిన జిల్లా కలెక్టర్.





**ఆంధ్ర ప్రగతి ఆళ్లగడ్డ/నంద్యాల, డిసెంబరు, 05:**
ఆళ్లగడ్డ పట్టణంలోని బాల సదనంను ను శుక్రవారం జిల్లా కలెక్టర్ సందర్శించి అక్కడ ఉన్న చంటి పిల్లలతో ప్రేమగా, ఆత్మీయతతో ముచ్చటించి వారి శుభాకాంక్షలను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అక్కడి పిల్లల సంక్షేమంపై వివరాలు తెలుసుకుని అందిస్తున్న సదుపాయాలు నివాసం, విద్య, పోషక ఆహారంపై అధికారులు తీసుకుంటున్న చర్యలను సమీక్షించారు. పిల్లల ఆరోగ్య పరిస్థితులు వారు పొందుతున్న సంరక్షణ, శుభ్రత పరిస్థితులను పరిశీలిస్తూ మరింత మెరుగైన సేవలు అందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. బాల సదనంలోని చిన్నారులతో కలెక్టర్ ఆప్యాయంగా పలకరించి వారి అవసరాలు, చిన్న కోరికలను తెలియజేసుకోవడంతో పాటు పిల్లలు ఆనందాన్ని వ్యక్తం చేశారు. చిన్నారులు ప్రదర్శించిన నృత్యాలను కలెక్టర్ తిలకించారు. బాధ్యతతో చిన్నారుల భవిష్యత్తును తీర్చిదిద్దాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అనంతరం అమృత్ పథకం క్రింద ఆర్ఫన్ చిల్డ్రన్ హెూమ్ చంటి పిల్లలకు ఎన్టీఆర్ వైద్య సేవ హెల్త్ కార్డులను పంపిణీ చేశారు. జిల్లా కలెక్టర్ వెంట స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారి లీలావతి, సంబంధిత అధికారులు ఉన్నారు.




# ప్రతి ఒక్కరూ ఆధార్ అప్డేట్ తప్పనిసరిగా చేయించుకోవాలి.

**ఆంధ్ర ప్రగతి నంద్యాల, డిసెంబర్ 5:**
ప్రతి ఒక్కరూ ఆధార్ అప్డేషన్ తప్పక చేయించుకోవాలని జిల్లా రెవెన్యూ అధికారి రాము నాయక్ పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నందు జిల్లాస్థాయి ఆధార్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఆర్ఓ రాము నాయక్ మాట్లాడుతూ.... ఆధార్ కార్డు కలిగిన ప్రతి వ్యక్తి తప్పనిసరిగా తమ ఆధార్ అప్డేషన్ చేయించుకోవాలన్నారు. ఆధార్ అప్డేషన్ కార్యక్రమాలు ఆధార్ నమెుదు కేంద్రాలలో నిర్వహించడం జరుగుతుంది. 5 నుంచి15 సంవత్సరాలు దాటిన పిల్లలు తమ బయోమెట్రిక్ అప్డేట్ తప్పనిసరిగ చేయించుకోవాలన్నారు.
ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగాలకు దరఖాస్తులు చేసుకోవడం, విద్యాసంస్థల్లో ప్రవేశం, బ్యాంకుల్లో ఖాతాలు తదితర అవసరాలకు




ఆధార్ కార్డు తప్పనిసరిగా ఉండాలన్నారు. ప్రస్తుతం బిడ్డపుట్టిన వెంటనే శిశుకు కూడా ఆధార్ కార్డు ఇచ్చేలా ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు.

**శిశు ఆధార్ నమోదు, అప్డేట్ తప్పనిసరి**

బిడ్డ పుట్టిన వెంటనే ప్రతి శిశువుకు ఆధార్ నమోదు చేయించడంతో పాటు.. ఐదేళ్లు పూర్తయిన వెంటనే.. బయోమెట్రిక్ నమోదు చేయించాలని.. ఆ దిశగా ప్రజల్లో




అవగాహన పెంచాలన్నారు. పుట్టిన ప్రతి శిశువుకు "శిశు ఆఫ్" ద్వారా తల్లిదండ్రుల ఆధార్ వివరాల ఆధారంగా తప్పనిసరిగా ఆధార్ నెంబర్ నమోదు చేయాలని.. 5 సంవత్సరాల 4 నెలలు పూర్తి అయిన తర్వాత పిల్లల ఫింగర్ ప్రింట్ తో బయోమెట్రిక్ సీడింగ్ చేయించాలన్నారు. ఈ ప్రక్రియను వైద్య ఆరోగ్య శాఖ, అంగన్వాడీ సిబ్బంది సమన్వయంతో చేపట్టాలన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికే నా మొదటి ప్రాధాన్యత.

**- మంత్రి ఎన్ఎండి ఫరూక్.**





**ఆంధ్ర ప్రగతి నంద్యాల డిసెంబర్ 05:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయశాఖ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ శుక్రవారం నాడు నంద్యాల తెలుగుదేశం పార్టీ కార్యాలయం నందు నిర్వహించిన "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకునే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన ఈ వేదిక ద్వారా పలువురు తమ సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి మంత్రి ఫరూక్ స్వయంగా అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారంలో ఎటువంటి జాప్యం ఉండకూడదని స్పష్టం చేశారు. ఆయన తక్షణమే ఆయా సమస్యలకు సంబంధించిన శాఖల అధికారులకు ఆదేశాలు జారీ చేయడం జరిగింది. నంద్యాల నియోజకవర్గ ప్రజలకు మెరుగైన సేవలు అందించడానికి ప్రభుత్వం తరపున, తెలుగుదేశం పార్టీ తరపున నిరంతరం కృషి చేస్తామని ఆయన హామీ ఇచ్చారు.

# పాత బ్రిడ్జి మరమత్తుల కోసం లక్షల ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేయడం ఎంతవరకు సబబు..?

**ఆంధ్ర ప్రగతి నంద్యాల డిసెంబర్ 05:**
నంద్యాల సోషల్ డెమొక్రటిక్ పార్టీ ఆఫ్ ఇండియా ఆఫీసు నందు నిర్వహించిన మీడియా సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఎజాస్ హుస్సేన్ మాట్లాడుతూ.. కుందూ నదిపై ఉన్న నందమూరి నగర్ కు వెళ్లే దారిలోని పాత బ్రిడ్జిపై మరమ్మత్తు పనులు చేయడం ద్వారా లక్షల రూపాయల ప్రజల సొమ్మును వృధా చేశారని, ఎందుకంటే కూలిపోయే బ్రిడ్జికి మరమ్మత్తులు చేయడము వృధా అని తెలిపారు. పాత బ్రిడ్జికి మరమ్మత్తులు చేసే బదులు అదే డబ్బుతో నూతన బ్రిడ్జి లో మిగిలిన కొద్ది మొత్తం పనులు పూర్తి చేయవచ్చని దీన్ని ఎందుకు విస్మరిస్తూ ఉన్నారని నంద్యాల ఎమ్మెల్యే ఎన్ఎండి ఫరూక్ గారికి ప్రశ్నించారు. ఇదే ప్రభుత్వం పద్మావతి నగర్ రోడ్డును ఆరు నెలల్లో పూర్తి చేసిందని కానీ బ్రిడ్జి పనులను ఎందుకు పూర్తి చేయడం లేదని అంటే పద్మావతి నగర్ రోడ్డులో తిరిగే వాళ్లే మనుషులా మరియు కుందూ నది బ్రిడ్జి మీద తిరిగే వాళ్ళు మనుషులు కాదా అని ప్రశ్నించారు. ఇప్పటికైనా బ్రిడ్జి పనులు మొదలుపెట్టడంలో ఎందుకు ఆలస్యం అవుతుందో ప్రజలకు వివరించాల్సిన బాధ్యత నంద్యాల ఎమ్మెల్యే అయిన ఎమ్మెల్యే ఫరూక్ మీద




ఉందని వెంటనే పత్రికా సమావేశం నిర్వహించి పనులు ఎందుకు మొదలుపెట్టుకోలేకపోయారో ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు. నంద్యాల అసెంబ్లీ అధ్యక్షులు వి హనీఫ్ మాట్లాడుతూ ప్రజల సొమ్ముతో శిధిలావస్థకు చేరిన బ్రిడ్జిని మరమ్మత్తులు చేయడం ఏంటని, కూటమి ప్రభుత్వానికి ఇప్పటికీ చిత్తశుద్ధి ఉంటే వెంటనే నూతన బ్రిడ్జి పనులు మొదలు పెట్టాలని లేనిపక్షంలో తాము ఎందుకు పనులు చేయడంలో విఫలమవుతున్నామో ప్రజల ముందుకు వచ్చి జవాబు ఇవ్వాలని డిమాండ్ చేశారు. నంద్యాల అసెంబ్లీ నాయకులు కరీముల్లా మాట్లాడుతూ ఆనాటి మరియు ఈనాటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మొదలుపెట్టిన బ్రిడ్జిని పూర్తి



చేయకపోవడం ప్రభుత్వానికి సిగ్గుచేటని విమర్శించారు. ఈ బ్రిడ్జి గుండా వెళ్లే దాదాపు 25 గ్రామాల ప్రజలు ఇబ్బంది పడుతున్న అధికారులకు మరియు మన నంద్యాల ఎమ్మెల్యే మరియు మంత్రివర్యులు అయినా ఎన్ఎండి ఫరూక్ కు చీమకుట్టినట్టు కూడా లేదని విమర్శించారు. మరమ్మత్తుల పేరుతో ప్రస్తుతము 19 లక్షలు మరియు ఇంతకుముందు ఆరు లక్షలు మొత్తంగా 24 లక్షల రూపాయల ప్రజాధనాన్ని మరమ్మత్తుల పేరు మీద వృధా చేశారని విమర్శించారు. ఈ పత్రిక సమావేశంలో జిల్లా కార్యదర్శి సుల్తాన్, అసెంబ్లీ ఉపాధ్యక్షులు మాజీద్ ఖాన్, అసెంబ్లీ నాయకులు ఫాసిల్ దేశాయ్, అత్తర్ హుస్సేన్,జమీల్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ఆత్మీయ సమావేశం.

**ఆంధ్ర ప్రగతి మహానంది, డిసెంబర్ 05:**
విద్యార్థులు తమ ఉజ్వల్ భవిష్యత కోసం బాగా చదువు కోవాలని శ్రీశైల నియోజకవర్గ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మెగా పేరెంట్స్, టీచర్స్ కార్యక్రమాన్ని మహానంది మండలంలోని అన్ని పాఠశాలల్లో పండుగలా నిర్వ హించారు. శుక్రవారం తిమ్మాపురం మోడల్ స్కూల్ నందు నిర్వహించిన కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కేసి కెనాల్ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ బన్నూరు రామలింగారెడ్డి, ఎంపీపీ బుడ్డారెడ్డి యశస్విని, ఎంపీడీవో మహబూబ్ దౌలా, స్కూల్ ప్రిన్సిపల్ లక్ష్మణరావు, మండల పార్టీ కన్వీనర్ కంచర్ల శివ, క్లస్టర్ ఇంచార్జి నరాల చంద్రమౌళీశ్వర్ రెడ్డి, స్థానిక టిడిపి నాయకులు రామ్ భూపాల్ రెడ్డి, బీజేపీ, జనసేన నాయకులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



## టిప్పర్ ఓనర్ టోల్గేట్ సిబ్బందికి మధ్య ఘర్షణ.



**ఆంధ్ర ప్రగతి పాణ్యం డిసెంబర్ 05:** నంద్యాల జిల్లా పాణ్యం మండలం తమ్మరాజుపల్లి గ్రామంలో, టిప్పర్ ఓనర్ లకు టోల్ గేట్ సిబ్బందికి మధ్య ఘర్షణ,వాగ్వివాదం,జరిగింది. విషయం ఏమిటంటే హైవే రోడ్డు ప్రక్కలగల టోల్ గేట్ వద్ద కొన్నిరోజులు క్రితం గ్రావెల్ మరియు మెటల్ కు(రుసుము)రాయల్టీ చెల్లించే విషయంలో డబ్బు రూపంలో కాకుండా ఫోన్ పే ద్వారా చెల్లించే విధంగా మాట్లాడుకోవటం జరిగింది. శుక్రవారం నాడు టిప్పర్ యజమానులు, టోల్ సిబ్బందికి,రాయల్టీ కొరకు, ఫోన్ పే అమౌంట్ చేస్తామని తమవద్ద నగదు లేదని చెప్పారు దీనికి టోల్ సిబ్బంది టిప్పర్ లకు రాయల్టీలు ఇవ్వకుండ వాహనాలను నిలిపివేయటం జరిగింది. దీనికి టిప్పర్ ఓనర్లు కోపోద్రికులై టోల్ సిబ్బంది యొక్క మానేజ్మెంట్ వారు వచ్చేవరకు టోల్ వద్ద బైటయించారు. టిప్పర్ వాహనదారులు,పాణ్యం పోలీస్ వారికి సమాచారం



అందించారు పాణ్యం సర్కిల్ ఇన్స్పెక్టర్ కిరణ్ కుమార్ రెడ్డి, సబ్ ఇన్స్పెక్టర్ నరేంద్ర కుమార్ రెడ్డి, గుత్తేదారుడు(కాంట్రాక్టర్) నాని ని,పిలిపించి సమస్యను పునరావృతం కాకుండా 50% ఫోన్ పే,50% డబ్బు రూపంలో రాయల్టీ చెల్లించే విధంగా మాట్లాడి సమస్యను సద్దుమణిగించారు.

# ఉపాధ్యాయుల మార్గదర్శకత్వంలో విద్యార్థులకు బంగారు భవిష్యత్తు

**చాపిరేవుల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన మెగా పేరెంట్స్-టీచర్స్ మీటింగ్ కార్యక్రమంలో మంత్రి ఫరూక్.**



















**ఆంధ్ర ప్రగతి నంద్యాల రూరల్ డిసెంబర్ 05:**
నంద్యాల పిల్లల బంగారు భవిష్యత్తు కోసం, పాఠశాల అభివృద్ధికి ఉపాధ్యాయులు-తల్లిదండ్రులు సమన్వయంతో కృషి చేయాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయశాఖ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు ఎన్.ఎండి. ఫరూక్ పిలుపునిచ్చారు.
శుక్రవారం నాడు నంద్యాల మండలం, చాపిరేవుల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన "మెగా పేరెంట్స్-టీచర్స్ మీటింగ్ (పేటీఎం) బడి వైపు ఒక అడుగు" కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయశాఖ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.
ఈ సందర్భంగా మంత్రి ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ "ప్రభుత్వం విద్యకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని . విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలంటే, పాఠశాల మరియు ఇంటి వద్ద పర్యవేక్షణ అత్యవసరం అన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల చదువు, క్రమశిక్షణపై రోజువారీ శ్రద్ధ చూపాలని. ఉపాధ్యాయులు బోధనలో మరింత నాణ్యతను పెంచలన్నారు . ఉపాధ్యాయులు మరియు తల్లిదండ్రులు ఉత్సవ వాతావరణంలో జరిగిన ఈ సమావేశంలో పాల్గొనడం ఎంతో సంతోషకరం," అని అన్నారు. పిల్లల బంగారు భవిష్యత్తు కోసం తల్లిదండ్రులు పాఠశాల వైపు ఒక అడుగు వేయాలన్నారు. తల్లిదండ్రులు మరియు ఉపాధ్యాయుల సమన్వయం విద్యార్థుల విజయానికి ఎంతగానో దోహదపడుతుందని తెలిపారు.
తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు అనే రెండు బలమైన స్తంభాలపైనే విద్యార్థి భవిష్యత్తు ఆధారపడి ఉంటుందని, ఈ పేరెంట్స్-టీచర్స్ మీటింగ్ విద్యార్థుల పురోగతిని సమీక్షించేందుకు, సమస్యలను చర్చించేందుకు ఒక పవిత్ర వేదిక కావాలన్నారు. ప్రతి విద్యార్థిలోనూ అపారమైన సృజనాత్మకత, ప్రతిభ దాగి ఉంటాయిని, వాటిని వెలికి తీసే బాధ్యత ఉపాధ్యాయులదని . అదే సమయంలో, తల్లిదండ్రులు తమ పిల్లలు పాఠశాల తర్వాత ఇంట్లో ఎంత సమయం చదువుకు కేటాయిస్తున్నారు, వారి ప్రవర్తన ఎలా ఉందనే దానిపై నిరంతర పర్యవేక్షణ చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని. తద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో ప్రపంచ స్థాయి వసతులు కల్పిస్తున్నామని. ఈ సౌకర్యాలను సద్వినియోగం చేసుకొని, మన విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులతో ధీటుగా ఎ ో ట ీ ఎ ు డ ే ల ా తీర్చిదిద్దాలన్నారు. పేదరికం కారణంగా ఏ ఒక్క విద్యార్థి కూడా చదువుకు దూరం కాకూడదని . ఇందుకోసం ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తోందని. తల్లిదండ్రులు ఈ పథకాలపై పూర్తి అవగాహన పెంచుకొని, తమ పిల్లలకు మెరుగైన విద్యను అందించేలా కృషి చేయాలన్నారు. పాఠశాల అభివృద్ధికి గ్రామ కమిటీ, పాఠశాల యాజమాన్య కమిటీ సభ్యులు చురుకైన పాత్ర పోషించాలని. ప్రభుత్వ పాఠశాలలు అభివృద్ధి చెందితేనే, గ్రామీణ ప్రాంత విద్యార్థులకు సమాన అవకాశాలు లభిస్తాయి అన్నారు. ఈ సందర్భంగా వివిధ క్రీడల్లో ప్రతిభ చూపించిన విద్యార్థినీ విద్యార్థులకు మెడల్స్ ను అందజేశారు . అనంతరం పాఠశాల యాజమాన్యం మంత్రి ఫరూక్ ని ఘనంగా సన్మానించడం జరిగింది.
సమావేశం ముగిసిన అనంతరం మంత్రి ఫరూక్ పాఠశాల ఆవరణలోనే విద్యార్థులతో కలిసి కూర్చుని, ప్రభుత్వం అందిస్తున్న మధ్యాహ్న భోజనం (మిడ్-డే మీల్స్) రుచిని, నాణ్యతను పరిశీలిస్తూ వారితో కలసి భోజనం చేశారు. మంత్రి ఫరూక్ భోజనం చేస్తూ, విద్యార్థులతో వారి చదువు, క్రీడలు, పాఠశాల సమస్యలు, భవిష్యత్తు లక్ష్యాల గురించి ఆప్యాయంగా అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో కలిసి భోజనం చేయడం ద్వారా, ప్రభుత్వ పాఠశాలల్లో అందిస్తున్న మధ్యాహ్న భోజన పథకం అమలు, ఆహార నాణ్యత మరియు పరిశుభ్రత ప్రమాణాలను మంత్రివర్యులు స్వయంగా పర్యవేక్షించారు. విద్యార్థుల సంక్షేమం, వారికి నాణ్యమైన విద్య అందించడంతో పాటు పౌష్టికాహారాన్ని అందిస్తున్నామన్నారు.
ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు, ఉర్దూ డిఐ అస్మద్దీన్, ఎంపీడీవో సుగుణ శ్రీ , నంద్యాల మండల టిడిపి కన్వీనర్ మునగాల విశ్వనాథ్ రెడ్డి, నీటి సంఘాల చైర్మన్ చాబోలు ఇలియాజ్, భూపాల్ రెడ్డి, వెంకటేశ్వర్ రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, బాల ముని మరియు ఎస్ఎంసి చైర్మన్, స్థానిక ప్రజాప్రతినిధులు, విద్యాధికారులు, ఉపాధ్యాయులు, మరియు భారీ సంఖ్యలో తల్లిదండ్రులు పాల్గొన్నారు.



---

## స్వాతంత్ర్యసమరయోధుల సేవలు చిరస్మరణీయం.

**సామాజిక కార్యకర్త డోన్ పి.మహమ్మద్ రఫి.**

**ఆంధ్ర ప్రగతి డోన్ డిసెంబర్ 05:**
డోన్ పట్టణం లో సామాజిక కార్యకర్త డోన్ పి.మహమ్మద్ రఫి ఆద్వర్యం లో స్వాతంత్ర్య సమరయోధులు అరబిందో ఘోష్ వర్ధంతిని పురస్కరించుకొని వారి చిత్ర పటానికి పూలమాల వేసి ఘణంగా నివాళ్ళు అర్పించి వారిని స్మరించుకున్నారుఈ సందర్భంగా సామాజిక కార్యకర్త డోన్ పి. మహమ్మద్ రఫి మాట్లాడుతూ.. మన దేశ స్వాతంత్ర్య సమరయోధులను, శాస్త్రవేత్తలను ,మహనీయులను, సమాజానికి సేవలు అందించిన ప్రతి ఒక్కరిని స్మరించుకుంటూ వారి అడుగుజాడల్లో నడవాలని సామాజిక కార్యకర్త డోన్ పి.మహమ్మద్ రఫి పేర్కొన్నారు.



## ఎన్నికల్లో ఇచ్చిన హామీకు కట్టుబడి నంద్యాలలో సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం.

**32 లక్షల రూపాయల నిధులతో సలీం నగర్ బ్రిడ్జ్ నుండి శ్యాం నగర్ వరకు నూతన సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం. నంద్యాల జిల్లా టిడిపి ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్.**

**ఆంధ్ర ప్రగతి నంద్యాల టౌన్ డిసెంబర్ 05:**
నంద్యాల సలీం నగర్ బ్రిడ్జ్ నుండి హనీఫ్ నగర్ ప్రాంతానికి కనెక్ట్ చేసే మార్గంలో నూతన సీసీ రోడ్డు నిర్మాణానికి 32 లక్షల రూపాయలతో పనులు ప్రారంభించడం జరిగింది.ఈ మార్గం ద్వార రోజువారీ వేలాది మంది ప్రజలు ఈ రోడ్డు గుండా ప్రయాణిస్తారు. మట్టి రోడ్డు గుంతలా మయం అయిపోవడంతో ప్రజలు చాల ఇబ్బందులకు గురయ్యేవారు,రాత్రులు వీధి దీపాలు లేకపోవడంతో ప్రజలు చిమ్మ చీకటిలో అటుగా వెళ్లాలంటే భయపడాల్సిన పరిస్థితి ఉండేదన్నారు. గత ఎన్నికల ప్రచారంలో ఈ ప్రాంతానికి విచ్చేసిన ఎన్ఎండి ఫిరోజ్ కు స్థానిక ప్రజలు, చుట్టూ ప్రక్కల వార్డు ప్రజలు, మస్జీద్ మరియు చర్చి కమిటీ సభ్యులు ఈ రోడ్డు ను నిర్మించాలని కోరడంతో వారికి తప్పక రోడ్డు వేయిస్తామని హామీనివ్వడం జరిగిందన్నారు.ఇచ్చిన మాటను నిజం చేస్తూ వీధి దీపాలు ఏర్పాటు చేయించి, డ్రైనేజీ పనులు పూర్తి చేయడం జరిగిందన్నారు.ఈ రోజు నూతన సీసీ రోడ్డు నిర్మాణానికి పనులు ప్రారంభించి ఈ ప్రాంత ప్రజల కష్టాన్ని శాశ్వతంగా పరిష్కరించబోతున్నమని తెలిపారు.గత వైసీపీ ప్రభుత్వం ఒక్క చిన్న రోడ్డు వెయ్యకుండా నంద్యాలను అన్ని విధాలుగా సర్వనాశనం చేసిందన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటు అయ్యినప్పటి నుండి ఎన్ ఎండి ఫరూక్ నాయకత్వంలో అన్ని విధాలుగా అభివ ృద్ధి చేస్తున్నామని తెలిపారు.నంద్యాలలో అన్ని ప్రాంతాల్లో రోడ్డు నిర్మాణాలు చేపట్టి నంద్యాలను అన్ని విధాలుగా అభివ ృద్ధి చేస్తున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ మనియార్ ఖలీల్, దూదేకుల కార్పొరేషన్ డైరెక్టర్ దస్తగిరి,మాజీ కౌన్సిలర్లు కొండారెడ్డి, నూర్ బేగ్, క ృపాకర్ వార్డు నాయకులు భాస్కర్,బాలక ృష?, ఖాజా, శరత్ తదితరులు పాల్గొన్నారు.



## చదువుతోనే విద్యార్థులకు బంగారు భవిష్యత్.

**బిసి రాజారెడ్డి. - జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఘనంగా తల్లిదండ్రుల - ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశం.**

**ముఖ్యఅతిథిగా హాజరైన బిసి రాజారెడ్డి.**





**ఆంధ్ర ప్రగతి బనగానపల్లె డిసెంబర్ 05:**
ఉన్నత చదువులు చదవడం ద్వారా బంగారు భవిష్యత్తు లభిస్తుందని బనగానపల్లె పట్టణ మాజీ సర్పంచ్ బిసి రాజారెడ్డి అన్నారు. బనగానపల్లె పట్టణం మంగళవారం పేటలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో శుక్రవారం తల్లిదండ్రుల - ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశం ఘనంగా నిర్వహించారు. ముందుగా ప్రధానోపాధ్యాయులు భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థిని, విద్యార్థులు బిసి రాజారెడ్డికి ఘన స్వాగతం పలికారు. అనంతరం విద్యార్థులు, వారి తల్లిదండ్రులను ఉద్దేశించి బిసి రాజారెడ్డి మాట్లాడుతూ... క్రమశిక్షణ, పట్టుదలతో విద్యనభ్యసిస్తే సాధించలేనిది ఏది ఉండదన్నారు. ఆడపిల్లలకు చదువు ఎంతో అవసరమని వారు చదువులో ఎప్పుడు ముందుండాలని సూచించారు. విద్యార్థులు , తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల మధ్య మంచి అనుబంధం ఉండడంతో పాటు వారి పిల్లల నడవడికను తెలియజేసేందుకు మెగా పేరెంట్స్ మీటింగ్ ను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను విద్యార్థులు ఉపయోగించుకొని మంచి విద్యావంతులుగా ఎదగాలని ఆకాంక్షించారు. నేటి ఆధునిక యుగంలో సాంకేతిక పరంగా ఎంతో ముందుకు వెళ్తున్నామన్నారు, కానీ టెక్నాలజీని మంచికి కాకుండా చెడు పనులకు ఎక్కువగా ఉపయోగిస్తూ ఉండటం ఆందోళన కలిగిస్తోందన్నారు. ముఖ్యంగా విద్యార్థులు సెల్ ఫోన్ లకు దూరంగా ఉండాలన్నారు. సెల్ ఫోన్ లో మంచి, చెడు రెండు ఉన్నాయని చాలామంది మంచికి కాకుండా చెడు కోసమే ఎక్కువగా వాటిని వినియోగించడం బాధాకరమన్నారు. అందువల్ల విద్యార్థులు సెల్ ఫోన్ కు బానిసలు కాకుండా దూరంగా ఉండాలని సూచించారు. తల్లిదండ్రులు కూడా పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. వారి నడవడికలను నిరంతరం గమనిస్తూ క్రమశిక్షణతో పెరిగేలా చూడాలన్నారు. పిల్లలకు చదువు బాగా రావాలనే సదుద్దేశంతోనే ఉపాధ్యాయులు తప్పు చేసిన పిల్లలను మందలిస్తుంటారని , అంతమాత్రాన పిల్లల చెప్పుడు మాటలు విని తల్లిదండ్రులు ఏదో జరిగిందని ఉపాధ్యాయులపై దండయాత్రకు రావడం సరైన పద్ధతి కాదన్నారు. అలా చేయడంవల్ల మీ పిల్లల భవిష్యత్తును మీరే చెడగొట్టిన వారు అవుతారని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన ఎంతోమంది ఐఏఎస్ , ఐపీఎస్ వంటి కొలువులు సంపాదించి ఉన్నత స్థానాలకు చేరుకున్నారన్నారు. అనంతరం ఉపాధ్యాయుల బ ృందం బిసి రాజారెడ్డిని శాలువా కప్పి పూలమాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు , తల్లిదండ్రులు , విద్యార్థులు పాల్గొన్నారు.





# అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం పోరాటం చేసిన ఘనుడు

# డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్



**"నేడే డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ 69 వ వర్ధంతి"**

**ఆంధ్ర ప్రగతి నంద్యాల జిల్లా డిసెంబర్ 05:**

**"భారతదేశానికి డిసెంబర్ 6 ఒక దుఃఖ దినం"అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం పోరాటం చేసిన ఘనుడు డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ 69 వ వర్ధంతి సందర్భంగా.."చదువుకున్న వ్యక్తి యొక్క జ్ఞానము నిరుపేదల సంక్షేమానికి ఉపయోగపడకపోతే అలాంటి చదువుకున్న వ్యక్తి సమాజానికి పెద్ద శాపం:- డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్.**

డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఆయన సిద్ధాంతాలను ఆశయాలను స్మరించుకుంటూ ఆయన చూపిన మార్గంలో మనం పయనించినప్పుడే ఆ మహా నాయకుడికి నిజమైన నివాళి అర్పించినట్లు అవుతుంది. డాక్టర్ భీమ్రావు అంబేద్కర్ బహుముఖ వ్యక్తిత్వం మేదస్సు ఆయన సామాజిక పోరాటాలు విస్త ృతంగా సమాజంలోకి చేరుకోగలిగాయి. ఆయన ఆశయాలు సిద్ధాంతాలు భవిష్యత్తు తరాలకు అందించడానికి పునాది వేసింది. 1948 వ సంవత్సరంలో భారత రాజ్యాంగ చరిత్రలో అత్యంత కీలకమైనది. ఎందుకంటే ఆ సంవత్సరం జరిగిన కమిటీ సమావేశంలో డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ గారి ప్రసంగము దేశ ప్రజాస్వామ్యం భవిష్యత్తుకు దారి చూపిన మహోత్తరమైనదిగా నిలిచినది. సమానత్వం, స్వేఛ్ఛ, న్యాయం, సామాజిక ప్రజాస్వామ్యం వంటి గొప్ప మూల విలువలను రాజ్యాంగంలో స్థాపించడానికి ఆ మహానుభావుడు చేసిన క ృషి స్పష్టమైన ఆలోచనల ప్రభోదం దేశ నిర్మాణానికి బలమైన పునాది వేసింది. ఆయన చేసిన ప్రసంగం కేవలం ఒక నివేదిక కాకుండా అణగారిన సామాజిక దళిత బడుగు బహుజన పీడిత వర్గాలకు కొత్త ఆశలను బలంగా నింపింది. ఈ దేశంలో శతాబ్దాలుగా అంటరానితనమును, అవమానాలను ఎదుర్కొంటూ న్యాయం కోసం కన్నీటితో ఎదురుచూస్తున్న కోట్లాది దేశ ప్రజలకు రాజ్యాంగం ద్వారా గౌరవం, స్వాతంత్ర్యం, సమానత్వం, అందించాలనే డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఆరోజు ఆయన చేసిన ప్రసంగంలో ప్రతిధ్వనించింది. ఈ చారిత్రకమైన ప్రసంగం భారతదేశాన్ని ఆధునిక ప్రజాస్వామ్య దేశంగా తీర్చిదిద్దిన మార్గదర్శక శక్తిగా నిలిచింది. సామాజిక న్యాయం కోసం శ్రమిస్తున్న ప్రతి ఒక్కరికి ఒక శాశ్వతవెలుగు అయితే డిసెంబర్ 6 భారతదేశానికి ఒక దుఃఖ దినం. కేవలం ఆయన రాజ్యాంగాన్ని రూపొందించిన వ్యక్తి మాత్రమే కాదు. అంటరానితనం, కుల వివక్ష వంటి అన్యాయాలను ఎదుర్కొని అణగారిన వర్గాల ప్రజలకు స్ఫూర్తినిచ్చిన మహోన్నత శిఖరం. ఆధునిక భారత ప్రజాస్వామ్యానికి పునాది వేసిన ఘనుడు ఆయన రూపొందించిన రాజ్యాంగం దేశంలోని అన్ని వర్గాల ప్రజలకు సమన్యాయం అందించేందుకు ఉద్దేశించబడింది.

## దేశంలోని అణగారిన వర్గాల కోసం,దేశం అభ్యున్నతి కోసం పోరాటం చేసిన ఘనుడు

దేశంలో ఆనాటి చీకటి రోజులలో ఉన్న కుల వ్యవస్థతో ,అసమానతలతో కుళ్ళిపోయిన వ్యవస్థను మార్చడానికి అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం, కుల నిర్మూలన కోసం అలుపెరుగని పోరాటం చేశారు. ఆనాటి సమాజంలో ఉన్న వివక్షతను సమాజం నుంచి పూర్తిగా తొలగించడమే ఆయన లక్ష్యం. "మానసిక స్వాతంత్ర్యమే నిజమైన స్వాతంత్ర్యం" అని డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ చెప్పారు. నేటికీ ఆయన మాటలు ఎంతో స్ఫూర్తిదాయకం మనసు స్వేఛ్ఛగా లేకపోతే సంకెళ్ళు లేకపోయినా వ్యక్తి బానిసతో సమానమని ఆయన చెప్పారు. డాక్టర్ బాబాసాహెబ్ గారు అనేక భాషలలో ప్రావీణ్యం కలిగిన జ్ఞానవంతుడు, ఆయన మేధస్సు ప్రపంచ జ్ఞాన లైబ్రరీ, అనేక భాషలలో పాళీ భాష, హిందీ, ఇంగ్లీషు, గుజరాతి, మరాఠీ భాషలలో అనేక గ్రంథాలు రచించారు. భారతదేశం అంతటా నాయకులు, వివిధ రాజకీయ పార్టీల పాలకులు, మరియు ప్రజలు ఆయన వర్ధంతి సందర్భంగా ఆయనకు నివాళులర్పించి ఆయన ఆశయాలను స్మరించుకుంటూ ఉన్నారు డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఒక వ్యక్తి కాదు విభిన్నమైన కోణాలలో కూడిన ఆలోచన ప్రపంచ జ్ఞాని ఆయన చేసిన క ృషి తరతరాలకు స్ఫూర్తినిస్తుంది."డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ కొందరివాడు కాదు అందరివాడు"వివక్షను సమాజం నుంచి తరిమి కొట్టేందుకు అన్ని వర్గాల వారికి సమన్యాయం చేసేందుకు గొప్ప రాజ్యాంగాన్ని రూపొందించారు. అంటరానితనంపై ఎక్కుపెట్టిన ఆయుధం, కుల దురహంకారంపై గొంతు ఎత్తిన స్వరం డాక్టర్ బాబాసాహెబ్ భీమ్రావు రాంజీ అంబేద్కర్ . ప్రజాస్వామ్యం, అంటరానితనం, కుల నిర్మూలన, ఆర్థిక సంస్కరణలు , దళితుల భారతదేశ చరిత్ర లాంటి విశేషమైన రచనలు మనకు అందించారు మనం ఆయన వర్ధంతిని మహాపరినిర్వాణ దివస్ గా నిర్వహించుకుంటున్నాం. ఆమహానుభావుడు చదువుకోవడానికి వెళ్లి వివక్షకు గురి అయ్యారు, మంచినీళ్లు తాగేందుకు ఎన్నో అవమానాలను ఎదుర్కొన్న వ్యక్తి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఎన్నో రచనలు చేసి వాటి ద్వారా సమాజంలో మార్పు కోసం విశేషంగా పోరాడి మెరుగైన సమాజం కోసం లిఖితపూర్వక భారత రాజ్యాంగాన్ని రచించి రాజ్యాంగ పరిషత్తుకు ప్రతిని అందజేశాడు.



## భారతదేశంలోనే కాకుండా ప్రపంచంలో అత్యంత శక్తివంతమైన నినాదం "జై.భీమ్"

భారతదేశంలో మరియు ప్రపంచంలో అత్యంత శక్తివంతమైన సామాజిక నినాదం ఏదైనా ఉందంటే అది "జై భీమ్" అని చెప్పాలి. ఎందుకంటే ఈ పదం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కు జయహో అనే సంపూర? అర్థాన్ని వ్యక్తపరుస్తుంది. ఇందులో "భీమ్" అనే పదం భీమారావు అంబేద్కర్ పేరులోనే ఈ పేరు నుండి వచ్చినదే "భీమ్" అనే విషయాన్ని గుర్తించాలి. వాస్తవంగా జై భీమ్ అంటే డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ గారికి జయహో, ఆయన పట్ల మనము చూపే గౌరవం, నమస్కారం, అని అర్థాలు మనకు ప్రతిబింబిస్తాయి. ఈ నినాదం ఎందుకు పుట్టిందంటే? కొన్ని శతాబ్దాలుగా కొనసాగిన అవమానకరమైన కులవివక్ష, అస్ప ృశ్యత, హక్కుల లోపం, సామాజిక అన్యాయం, కడు పేదరికం,దారిద్ర్యం, ఇవన్నీటిని ఎదుర్కొని తాము కూడా మానవులమే అనే స్వాభిమానం ప్రకటించడానికి ఈ దేశంలో ఈ నినాదం శక్తివంతంగా పుట్టింది. జై భీమ్ అనే పదములో సమానత్వం, స్వేఛ్ఛ, బాంధవ్యం, అలాగే రాజ్యాంగ పోరాటమును సూచించే విధంగా నినాదంగా స్వీకరించబడింది. ఈ జై భీమ్ అనే పదాన్ని ఎవరు స ృష్టించారు? ఎప్పుడు ప్రాచుర్యంలోకి వచ్చింది అనే విషయాలను మనం గమనించినట్లయితే చారిత్రక పరిశోధనల ప్రకారం ఎల్ .ఎన్ హర్దాస్ గారు 1930 సంవత్సర కాలంలో రూపొందించినట్లు సమాచారం తెలుస్తుంది. డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ నడుపుతున్నటువంటి ఉద్యమానికి ఒక ఉద్యమ కార్యకర్తగా ఉన్న హార్డస్ సమాజంలోని సభ్యులు ఒకరితో మరొకరు పలకరించేటప్పుడు జై భీమ్ అనబడే పదము ద్వారా శుభదాయకంగా గ్రీటింగ్ మాదిరిగా నమస్కరించుకునే విధంగా ప్రవేశపెట్టినట్లు మనకు తెలుస్తుంది. తర్వాత కాలంలో దేశవ్యాప్తంగా ఇది కొన్ని కోట్ల మంది ఉద్యమ కార్మికుల నోట వెలువబడుతూ భారతదేశంలోనే కాకుండా ప్రపంచ వ్యాప్తంగా కూడా సామాజిక విప్లవ నినాదంగా మారింది. అయితే జై భీమ్ అనే పదానికి పాలి భాషలో అర్థం ఉందా? చాలామంది మేధావులు "జయహో జ్ఞానవంతుడా" అని అర్థం ఉందని మనకు కొంతమంది మేధావులు వేదికల పైన కూడా చెప్తూ ఉంటారు. మరికొందరు జ్ఞానము వర్ధిల్లు గాక అంటారు.ఒక విధంగా అత్యంత స్పష్టమైన అర్థం గా చెప్పుకోవాలంటే జై భీమ్ అంటే భీమ్రావు అంబేద్కర్ గారికి జయహో అని గౌరవంగా చెప్పుకోవచ్చు. అయితే దేశవ్యాప్తంగా అనేక ఉద్యమాలు జరుగుతున్నాయి. హక్కుల ఉద్యమాలు, రాజ్యాంగ పరిరక్షణ, విద్యా సంస్థలు, వివిధ విశ్వవిద్యాలయాలలో, బౌద్ధ సమాజంలో, వివిధ ప్రజా వేదికలలో యువత పోరాడే ప్రతి వేదికలలో కూడా ధైర్యం మరియు స్వాభిమానం యొక్క ప్రతీకగా నిలుస్తుంది. ఈ జై భీమ్ కేవలం నినాదం కాదు ఆత్మగౌరవంతో ఒక విప్లవం స ృష్టిస్తుంది. ఇది ఒక మానవతా గర్జన మనువాద పాలకులలో వణుకు పుట్టించే నినాదంగా మారింది.

నేను స్వేఛ్ఛ సమానత్వం మరియు సోదరభావం అనే మతాన్ని నమ్ముతాను డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్

డాక్టర్ భీమ్ రావు రాంజీ అంబేద్కర్ గారు బాల్యం నుండి వివక్షకు గురై అంటరానితనము నుండి భారత రాజ్యాంగ రూపశిల్పిగా మన దేశం మొదటి న్యాయశాఖ మంత్రిగా ఎదిగిన ఒక గొప్ప సంఘసంస్కర్త, న్యాయవాది, ఆర్థికవేత్తగా ఎన్నో కష్టాలను ఎదుర్కొంటూ విద్యను అభ్యసించి కులనిర్మూలన, అంటరానితనం తొలగింపు కోసం జీవితాంతం పోరాడినారు. 1891 వ సంవత్సరం ఏప్రిల్ 14న జన్మించిన డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ అంటరానితనం కారణంగా పాఠశాలలో తీవ్ర వివక్షతను ఎదుర్కొన్నాడు. అంటరాని కులానికి చెందినప్పటికీ అనేక అడ్డంకులను ,ఆటంకాలను అధిగమించి బొంబాయి లోని ఎల్ఫిన్ స్టోన్ కళాశాల నుండి బి.ఏ పట్టపొందారు. అదేవిధంగా అమెరికాలోని కొలంబియా విశ్వవిద్యాలయంలో ఆర్థిక శాసనంలో ఎం.ఏ ఫిలాసఫీలో డాక్టర్ ఎటు పొందారు. కుల వివక్షను రూపుమాపడానికి ఆయన అంకితభావంతో పనిచేశారు. 1927 వ సంవత్సరంలో మహాడ్ చెరువు నీటిని అంటరాని కులాల వారు తాగకూడదని నిషేధాన్ని సవాలు చేస్తూ వేలాది మందితో ఆ చెరువు నీటిని తాగించేందుకు ఉద్యమము నడిపించినారు. భారతదేశ స్వతంత్రం తరువాత మొదటి న్యాయ శాఖ మంత్రిగా 1947 నుండి 1951 వ సంవత్సరం వరకు బాధ్యతలు స్వీకరించినారు. "నేను స్వేఛ్ఛ సమానత్వం మరియు సోదర భావం అనే మతాన్ని నమ్ముతాను"డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ మానవ హక్కుల సుప్రీం ఛాంపియన్, అక్టోబర్ 14, 1956 సంవత్సరంలో భారతదేశానికి ఒక చారిత్రాత్మక రోజు ఈ రోజున సామాజిక సంస్కర్త మరియు భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ నాగపూర్ లో తన అనుచరులతో కలిసి హిందూ మతాన్ని విడిచి బౌద్ధ మతం లోకి మారారు. ఈ సంఘటన చారిత్రాత్మకమైనది ఎందుకంటే మతమార్పిడుల సంఖ్య చాలా ఎక్కువగా ఉండటం వల్లనే కాదు మరింత ముఖ్యంగా మానవ హక్కులను నొక్కి చెప్పడంలో ఇది ఒక మైలురాయి ఇది అణిచివేత నుండి స్వేఛ్ఛ మరియు ఆత్మగౌరవం మరియు సమానత్వంతో కొత్త జీవితాన్ని పొందటానికి ప్రతీక. భారత రాజ్యాంగాన్ని రూపొందించి ముసాయిదా కమిటీకి అధ్యక్షత వహించి భారతదేశానికి రాజ్యాంగ నిర్మాతగా నిలిచినారు. హిందూ మతాన్ని తిరస్కరించి చివరి దశలో బౌద్ధ మతాన్ని స్వీకరించినారు. 1956 వ సంవత్సరములో అక్టోబర్ 29 తేదీ నాడు నాగపూర్ లో తలపెట్టిన బౌద్ధ ధర్మ దీక్ష సదస్సులో అంబేద్కర్ తన అనుచరులతో బౌద్ధ ధర్మమును ఐదు లక్షల మందితో స్వీకరించారు. డాక్టర్ బాబా సాహెబ్ భీమ్రావు అంబేద్కర్ డిసెంబర్ 6 న 1956 సంవత్సరంలో ఢిల్లీలోని తన నివాసములో నిద్రలోనే మరణించారు. డయాబెటిస్ వ్యాధితో బాధపడ్డాడు. మరణించడానికి ముందు ఆయన ఆరోగ్యం క్షీణించిందని ఆనాటి నాయకులు ఆయనను అనుసరించిన ధనుంజయ్ కీర్ తన రచనలలో వెల్లడించాడు. తన చివరి పుస్తకం "ది బుద్ధ అండ్ హిస్ దమ్మ "ను పూర్తి చేసి ఆయన మరణించారు. ఆయన సిద్ధాంతాలను ఆశయాలను స్మరించుకుంటూ ఆయన చూపిన మార్గంలో పయనిద్దాం అప్పుడే ఆ మహా నాయకుడికి నిజమైన నివాళి అర్పించినట్లు అవుతుంది. అందరికీ జై భీములు.



**డా.జి.బాలస్వామి**
న్యాయవాది మరియు ఫ్రీలాన్స్ జర్నలిస్టు
పూలే అంబేడ్కర్ జ్ఞాన కేంద్రం వ్యవస్థాపక అధ్యక్షుడు.

# విద్యార్థులు ఉన్నతంగా చదివి

# గొప్ప ప్రయోజకులు కావాలి.

## తల్లిదండ్రుల కు ఉపాధ్యాయులు కు మంచి పేరు తీసుకురావాలి.

## 38వ వార్డు టీడీపీ ఇంచార్జ్ తాటికొండ బుగ్గ రాముడు.





**ఆంధ్ర ప్రగతి నంద్యాల డిసెంబర్ 05:**
రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మెగా పేరెంట్స్ టీచర్ మీటింగ్ కు నంద్యాల నియోజకవర్గం లోని నందమూరి నగర్ 38 వార్డ్ లోని పురపాలక ప్రాథమిక ఉన్నత పాఠశాల లో శుక్రవారం పాఠశాల హెడ్ మాస్టర్ నారాయణ రెడ్డి ఆహ్వానం మేరకు 38 వార్డు ఇంచార్జ్ తాటికొండ బుగ్గ రాముడు హాజరయ్యారు. పాఠశాల విద్యార్థులు మరియు పాఠశాల సిబ్బంది బుగ్గరాముడు కు ఘన స్వాగతం పలికారు.అనంతరం విద్యార్థులను ఉద్దేశించి బుగ్గరాముడు మాట్లాడుతూ విద్యార్థులు ప్రాథమిక దశ నుండి పాఠశాలలో మంచి క్రమశిక్షణ మరియు నైతిక విలువలతో కూడిన చదువు చదువుకొని గొప్ప ప్రయోజకులు కావాలని , మిమ్మల్ని కన్నవారికి, ఉన్న ఊరికి, ఉపాధ్యాయులకు,పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని తెలిపారు.ఉన్న స్థాయి నుంచి ఉన్నత స్థాయికి చేరుకోవడానికి నిరంతర శ్రమ పట్టుదల క ృషి అవసరమని తెలిపారు.మారుతున్న టెక్నాలజీ పరంగా ప్రతీ ఒక్కరూ సాంకేతిక పరిజ్ఞానాన్ని అలవరుచుకొని నూతన నైపుణ్యాలను పెంపొందించుకోవడానికి నిరంతరం ప్రయత్నిస్తూ ఉండాలని చెప్పారు.అంతేకాక పాఠశాల నందు ఒక టేబులు కొనుగోలు కొరకు 5వేలు రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు అదేవిదంగా మంత్రి ఎన్ఎండి.ఫరూక్ వారి కుమారులు ఫిరోజ్,ఫయాజ్ ఆధ్వర్యంలో పాఠశాలను మరింత అభివ ృద్ధి బాటలో ముందుకు తీసుకెళతాం అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో హెడ్ మాస్టర్ నారాయణ రెడ్డి గారు మాట్లాడుతూ ప్రభుత్వం విద్య కు మంచి ప్రాధాన్యత ఇస్తూ విద్యార్థుల సమగ్ర అభివ ృద్ధి కి నిరంతరం క ృషి చేస్తూనే ఉంది దీనిని ఉపయోగించుకుని ముందుకు వెళ్ళాలని తెలిపారు. టిడిపి యువ నాయకులు తాటికొండ మహేష్ మాట్లాడుతూ చిన్నప్పటి నుంచి డ్రగ్స్,మత్తు పదార్థాలు కు దూరంగా చెడు అలవాట్లు వ్యసనాలకు



బానిస కాకుండా ఉన్నత స్థాయికి చేరుకోవడానికి నిరంతర క ృషి చేయాలని పిలుపునిచ్చారు అనంతరం తల్లిదండ్రులు కు విద్యార్థుల చేత పాదాభివందనం చేయించారు.ఈ కార్యక్రమంలో తాటికొండ మహేష్ బాబు,విద్యా శాఖ ఏ డి రమాదేవి హెడ్ మాస్టర్ నారాయణ రెడ్డి, చైర్మన్ ముబీన,అడ్వకేట్ సుబ్బారెడ్డి, మరియు ఉపాధ్యాయులు విద్యార్థులు,తల్లిదండ్రులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ఏపీ మోడల్ స్కూల్లో ఘనంగా

# మెగా పేరెంట్స్ డే వేడుకలు.

## అలరించిన చిన్నారుల నృత్య ప్రదర్శనలు.



**ఆంధ్ర ప్రగతి శిరివెళ్ళ డిసెంబర్ 05:**
మండల కేంద్రంలోని రుద్రవరం రాస్తా వైపు ఉన్నటువంటి ఏపీ మోడల్ స్కూల్ మరియు కళాశాలలో మెగా పేరెంట్స్ అండ్ టీచర్స్ డే సమావేశం వైభవంగా జరిగింది. మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ డాక్టర్ ఇస్రాత్ బేగం అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి మాజీ జెడ్పీటీసీ యామా గుర్రప్ప, ఎంఈఓ 2 నాగార్జున రెడ్డి ఇతర ప్రముఖులు హాజరయ్యారు ఈ సందర్భంగా విద్యార్థుల విద్యాభ్యాసంలో నాణ్యత ప్రమాణాలు మెరుగుపరిచడానికి పాఠశాలలో ఉపాధ్యాయులు ఇంటి వద్ద తల్లిదండ్రులు పర్యవేక్షించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఏపీ మోడల్ స్కూల్లో చదువుతున్న విద్యార్థిని విద్యార్థులకు మంచి ప్రతిభాపాటవాలు ఉన్నాయని వాటిని వెలికి తీసి ఆణిముత్యాలుగా తీర్చిదిద్దాల్సిన అవసరం ఉపాధ్యాయులపై తల్లిదండ్రులపై ఉందన్నారు. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా శిరివెళ్ళ లోని ఏపీ మోడల్ స్కూల్ ఉన్నదని ఈ స్కూల్లో సీటు లభించడం పట్ల విద్యార్థులు తల్లిదండ్రులు అదృష్టంగా భావించాలని ప్రిన్సిపల్ ఇష్రాత్ బేగం సూచించారు. అనంతరం నిర్వహించిన క్రీడా సాంస్కృతిక కార్యక్రమాలలో బాలికలు అత్యుత్తమ నైపుణ్యత చాటారు. సుమారు 300 మంది విద్యార్థుల తల్లిదండ్రులకు సహపంక్తి భోజనం ఏర్పాటు చేశారు. విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు విద్యార్థిని విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక
శనివారం 6 డిసెంబర్ 2025

# రైతే దేశానికి వెన్నముక్క

## రైతు లేకపోతే జీవితం లేదు. ...రైతుల పట్ల గౌరవం,కృతజ్ఞత విద్యార్థుల్లో పెరగాలి.









**ఆంధ్ర ప్రగతి నంద్యాల డిసెంబర్ 05:**
రైతే దేశానికి వెన్నముక్క రైతులు లేకపోతే జీవితం లేదని,రైతుల పట్ల గౌరవం,కృతజ్ఞత ప్రతి విద్యార్థిలో పెరగాలని శ్రీ సంకల్ప్ ఒలంపియాడ్ పాఠశాల కరస్పాండెంట్ సుధాకర్ పేర్కొన్నారు.

శ్రీ సంకల్ప్ ఒలింపియాడ్ స్కూల్, బాలాజీ కాంప్లెక్స్ లో ఫార్మర్స్ డే ను శుక్రవారం ఎంతో అంగరంగ వైభవంగా నిర్వహించారు. పాఠశాల ఆవరణమంతా పచ్చదనం నిండిన 'గ్రీన్ మార్కెట్' వాతావరణంతో అందరి దృష్టినీ ఆకర్షించింది. విద్యార్థులు రైతుల వేషధారణలో పాల్గొని తాము పెంచినట్లు సజీవంగా చూపిస్తూ వివిధ రకాల కూరగాయల స్టాల్స్ ఏర్పాటు చేసి విక్రయించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పిల్లలు ఇలా వ్యవసాయ జీవనాన్ని ప్రతిబింబిస్తూ సంతను సృష్టించగా, తల్లిదండ్రులు కూడా ఉత్సాహంగా పాల్గొని పిల్లల దగ్గర కూరగాయలను కొనుగోలు చేస్తూ వారిని ప్రోత్సహించారు.

ఈ కార్యక్రమానికి శ్రీ శాంతినికేతన్ విద్యాసంస్థల చైర్మన్ సుధాకర్, వారి సతీమణి హాజరై ప్రతి స్టాల్‌ను సందర్శించి, విద్యార్థుల కృషిని ప్రశంసిస్తూ వారివద్ద నుండే కూరగాయలు కొనుగోలు చేశారు. చిన్నారుల్లో కనిపించిన ఆత్మవిశ్వాసం, సృజనాత్మకత అందరికీ కన్నులపండువగా అనిపించింది. ఫార్మర్స్ డే ముఖ్య ఉద్దేశ్యం మనకు అన్నదాతలైన రైతులు ప్రతిరోజూ పడుతున్న కష్టాలు, వారి ప్రాముఖ్యతను చిన్నారులకు తెలియజేయడం. దీనిలో భాగంగా విద్యార్థులు రైతుల జీవిత పర్యవసానాలు, విలువలు, కష్టాలను ప్రతిబింబించే స్కిట్లు, నృత్యాలు, ప్రసంగాలు ప్రదర్శించి అందర్నీ ఆకట్టుకున్నారు.

ఈ సందర్భంగా శాంతినికేతన్ విద్యాసంస్థల చైర్మన్ సుధాకర్ మాట్లాడుతూ..

"రైతు లేకపోతే జీవితం లేదు. రైతుల పట్ల గౌరవం, కృతజ్ఞత ప్రతి విద్యార్థిలోనూ పెరగాలి" అని ప్రత్యేకంగా పేర్కొన్నారు.

కార్యక్రమం ఎంతో విజయవంతంగా ముగిసింది. పాఠశాల నిర్వహణ ఈ కార్యక్రమానికి సహకరించిన తల్లిదండ్రులకు ధన్యవాదాలు తెలుపగా, తల్లిదండ్రులు కూడా పాఠశాల నిర్వహణ ఇలాంటి అర్థవంతమైన మరియు విలువలను పెంపొందించే కార్యక్రమాలు నిర్వహించడం పట్ల ప్రశంసలు కురిపించారు.

# శంషాబాద్ విమానాశ్రయంలో ప్రయాణికుల ఆందోళన

### ఇండిగో విమానాల రద్దుతో ప్రయాణికుల ఆగ్రహం

### ఎపి మంత్రి పార్థసారథి చొరవతో అయ్యప్ప భక్తులకు ప్రత్యేక విమానం






**హైదరాబాద్,డిసెంబర్,5,ఆంధ్ర ప్రగతి**
ఇండిగో విమానాల రాకపోకలను నిలిపేయడంతో శంషాబాద్ విమానాశ్రయంలో ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేశారు. మొత్తం 92 విమానాలు రద్దు చేసినట్లు ఆ సంస్థ వెల్లడించింది. ఇందులో శంషాబాద్‌కు రావాల్సినవి 43, ఇక్కడి నుంచి వెళ్లాల్సినవి 49 ఉన్నాయి. ముందుగా బుక్ చేసుకున్న సర్వీసుల రద్దుపై ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. చెక్ఇన్ అయిన తర్వాత రద్దు సమాచారం ఇవ్వడంపై నిరసన తెలిపారు. మరోవైపు విశాఖ నుంచి 8 ఇండిగో విమాన సర్వీసులు రద్దు చేశారు. వీటిలో హైదరాబాద్, చెన్నై, బెంగళూరు, అహ్మదాబాద్‌కు వెళ్లాల్సినవి ఉన్నాయి.

ఏపీ మంత్రి పార్థసారథి జోక్యంతో శబరిమలకు వెళ్లే అయ్యప్ప భక్తులకు ప్రత్యేక విమాన సదుపాయాన్ని కల్పించారు. అంతకుముందు విజయవాడ వెళ్లేందుకు శంషాబాద్‌లో ఇండిగో విమానం కోసం పార్థసారథి వేచి ఉన్నారు. అయ్యప్ప భక్తులు ప్రయాణించే విమానం ఆలస్యంపై అడిగి తెలుసుకున్నారు. వారి ఆందోళనను గమనించి స్వయంగా కేంద్రమంత్రి రామ్మోహన్‌తో మాట్లాడారు. శబరిమలకు విమాన సర్వీసు ఏర్పాటు చేయించారు. విజయవాడకు వెళ్లాల్సిన విమానం మిస్ కావడంతో మంత్రి పార్థసారథి రోడ్డు మార్గంలో బయలుదేరారు. తమకోసం శ్రమపడి ప్రయాణ సదుపాయం కల్పించిన ఆయనకు అయ్యప్ప భక్తులు ధన్యవాదాలు తెలిపారు. ఇకపోతే దేశీయ విమానయాన సంస్థ ఇండిగో విమానాల రద్దు పరంపర కొనసాగుతున్నది.

సిబ్బంది కొరత, సాంకేతిక సమస్యలతో వరుసగా మూడో రోజూ పెద్ద సంఖ్యలో సర్వీసులు నిలిచిపోయాయి. శుక్రవారం మొత్తం 500కుపైగా విమానాలను సంస్థ రద్దు చేసింది. దీంతో ఎయిర్‌పోర్టుల్లో ఇండిగో ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. బోర్డింగ్ ప్రక్రియ ముగిసి 12 గంటలవుతున్నా తాము వెళ్లాల్సిన విమానానికి సంబంధించిన ఎలాంటి సమాచారం లేకపోవడంతో ఆందోళలనకు దిగుతున్నారు. శంషాబాద్ విమానాశ్రయంలో అయ్యప్ప స్వాముల నిరసనతో తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకున్నది. హైదరాబాద్ నుంచి కొచ్చి వెళ్లాల్సిన విమానం 12 గంటల పాటు ఆలస్యం కావడంతో అయ్యప్పలు ఆందోళనకు దిగారు. ఇండిగో విమానం గురువారం సాయంత్రం హైదరాబాద్ నుంచి కొచ్చి వెళ్లాల్సి ఉంది. ఈ విమానంలో వెళ్లాల్సిన అయ్యప్ప భక్తులు సాయంత్రమే శంషాబాద్ విమానాశ్రయానికి చేరుకున్నారు. అయితే, విమానం శుక్రవారం ఉదయానికి కూడా బయలుదేరకపోవడంతో వారు ఆందోళనకు దిగారు. బోర్డింగ్ గేటుకు అడ్డంగా బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. 12 గంటలుగా తాము విమానాశ్రయంలోనే ఉన్నామని, విమానం గురించి తమకు సమాచారం ఇవ్వడంలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు కూడా చేయలేదని ఆసహనం వ్యక్తం చేశారు. కాగా, ఇండిగో విమానాల రద్దు కారణంగా ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రెండు, మూడు రోజులుగా విమానా సర్వీసులు లేకపోవడంతో ఎయిర్‌పోర్టుల్లో ప్రయాణికులు పడిగాపులు కాస్తున్నారు.

# శ్రీలంకను కుదిపేసిన దిత్వా తుఫాన్

### ఇప్పటి వరకూ 486 మంది మృత్యువాత

### సుమారు 341 మంది ఆచూకీ గల్లంతు



**కొలంబో,డిసెంబర్,5,ఆంధ్ర ప్రగతి** దిత్వా తుఫాన్ ద్వీప దేశం శ్రీలంకను భారీగా కుదిపేసింది. తుఫాను బీభత్సానికి కుండపోత వర్షాలు కురిశాయి. దీంతో ఎక్కడికక్కడ వరదలు సంభవించాయి. ఇళ్లు కూలిపోయాయి. కొండచరియలు విరిగిపడ్డాయి. అనేక పట్టణాలు పూర్తిగా నీట మునిగాయి. వేలాది మంది ప్రజలు నిరాశ్రయులయ్యారు. శ్రీలంక విపత్తు నిర్వహణ కేంద్రం వెల్లడించిన వివరాల ప్రకారం.. 20 రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మౌలిక సదుపాయాలు దెబ్బతిన్నాయి. రోడ్లు, వంతెనలు కొట్టుకుపోవడంతో జనజీవనం స్తంభించింది. దిత్వా తుఫాను బీభత్సానికి భారీగా ఆస్తి ప్రాణ నష్టం సంభవించింది. నవంబర్ 16 నుంచి ఇప్పటి వరకూ 486 మంది ప్రాణాలు కోల్పోయారు. సుమారు 341 మంది ఆచూకీ గల్లంతయింది. ఈ సంక్షోభ సమయంలో భారత దేశం శ్రీలంకకు అండగా నిలుస్తోంది. 'ఆపరేషన్ సాగర్ బంధు' పేరుతో మానవతా సాయాన్ని అందజేస్తోంది. జాతీయ విపత్తు స్పందన దళం , భారత వాయు సేన ప్రజల ప్రాణాలను కాపాడుతున్నాయి.

# బాలకృష్ణ అభిమానులకు నిరాశ

### అఖండ-2 వాయిదా వేసిన నిర్మాణ సంస్థ



**హైదరాబాద్,డిసెంబర్,5,ఆంధ్ర ప్రగతి** బాలకృష్ణ – బోయపాటి శ్రీను కాంబినేషన్‌లో రూపొందిన తాజా చిత్రం 'అఖండ 2' వాయిదా పడింది. ఈ సినిమా విడుదలపై కొన్ని గంటలుగా సందిగ్ధత నెలకొన్న సంగతి తెలిసిందే. ఈ చిత్రం సమస్యల్లో చిక్కుకున్నట్లు వార్తలొచ్చాయి. గురువారం రాత్రి ప్లాన్ చేసిన ప్రీమియర్స్‌ను చిత్ర బృందం రద్దు చేయడంతో.. ఆ వార్తలకు బలం చేకూరింది. తాజాగా చిత్ర విడుదలను వాయిదా వేస్తున్నట్లు నిర్మాణ సంస్థ 14 రీల్స్ ప్లస్ ప్రకటించింది. షెడ్యూల్ ప్రకారం ఈనెల 5న థియేటర్లలో ఈ చిత్రం విడుదల కావాల్సిఉంది. ఈ మేరకు 14 రీల్స్ ప్లస్ సంస్థ ఎక్స్ వేదికగా పోస్టు చేసింది. 'అనివార్య కారణాల వల్ల 'అఖండ 2' షెడ్యూల్ ప్రకారం విడుదల కావడం లేదు. ఈ విషయం పట్ల చింతిస్తున్నాం. ఈ క్షణం మాకు చాలా బాధాకరమైనది. ప్రతి అభిమాని, సినీ ప్రేమికుడికి ఇది కలిగించే నిరాశను మేము అర్థం చేసుకుంటాము. ఈ విషయాన్ని వీలైనంత త్వరగా పరిష్కరించడానికి అవిశ్రాంతంగా కృషి చేస్తున్నాము. ఈ నిర్ణయం పట్ల కలిగిన అసౌకర్యానికి మా హృదయపూర్వక క్షమాపణలు. ఈ సమయంలో మీ మద్దతు మాకు చాలా అవసరం. అతి త్వరలో సానుకూల నిర్ణయంతో మీ ముందుకు వస్తాం అని నిర్మాణ సంస్థ పేర్కొంది.

# స్వల్పంగా పెరిగిన బంగారం ధరలు

**న్యూఢిల్లీ,డిసెంబర్,5,ఆంధ్ర ప్రగతి** మగువలకు బంగారం ధరలు మళ్లీ షాకిచ్చాయి. నిన్న స్వల్పంగా తగ్గిన ధరలు.. శుక్రవారంమళ్లీ పెరిగిపోయాయి. రోజుకోలాగా బంగారం ధరలు హెచ్చు తగ్గులు అవుతున్నాయి. శుక్రవారం తులం గోల్డ్‌పై రూ.270 పెరగగా.. సిల్వర్ ధర మాత్రం దిగొచ్చింది. ఏకంగా రూ.4,000 తగ్గింది.బులియన్ మార్కెట్‌లో ఈరోజు 24 క్యారెట్ల 10 గ్రాముల ధరపై రూ.270 పెరిగి రూ.1,29, 930 దగ్గర ట్రేడ్ అవుతుండగా.. ఇక 22 క్యారెట్ల 10 గ్రాముల ధరపై రూ.250 పెరిగి రూ.1,19,100 దగ్గర అమ్ముడవుతోంది. ఇక 18 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధరపై రూ.210 పెరిగి రూ.97, 450 దగ్గర ట్రేడ్ అవుతోంది.వెండి ధర మాత్రం ఈరోజు భారీ ఉపశమనం కలిగింది. ఈరోజు బులియన్ మార్కెట్‌లో కిలో వెండిపై రూ.4,000 తగ్గి రూ.1,87, 000 దగ్గర ట్రేడ్ అవుతోంది. చెన్నై, హైదరాబాద్‌లో మాత్రం రూ.1,96,000 దగ్గర అమ్ముడవుతోంది. ఇక ఢిల్లీ, ముంబై, కోల్‌కతాలో మాత్రం కిలో వెండి రూ.1,87,000 దగ్గర ట్రేడ్ అవుతోంది.

# టాటా ట్రస్టు నుంచి భారీగా ఎన్నికల విరాళాలు..

## ఒక్క పైసా అందుకోని టీడీపీ, జనసేన!




**డిసెంబర్,5,ఆంధ్ర ప్రగతి**
గత ఏడాది జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ప్రముఖ దేశీయ అతిపెద్ద వ్యాపార సంస్థల సమూహమైన టాటా గ్రూపు పెద్ద ఎత్తున విరాళాలు అందజేయడం చర్చనీయాంశం అవుతోంది. ఎన్నికలకు ముందు అధికార బీజేపీతోపాటు ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్ పార్టీకి కూడా టాటా గ్రూపు విరాళాల అందజేసింది. అదేవిధంగా వివిధ రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న ప్రాంతీయ పార్టీలకు నిధులు సమకూర్చిన టాటా గ్రూపులోని ప్రొగ్రెసివ్ ఎలక్టోరల్ ట్రస్టు కొన్ని ముఖ్యమైన పార్టీలను విస్మరించడంపై ఆసక్తికర చర్చ జరుగుతోంది. టాటా గ్రూప్ తన వ్యాపారాల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకోవడంతోపాటు ఆరోగ్యకరమైన ప్రజాస్వామ్యాన్ని ప్రోత్సహించాలనే ఉద్దేశంతో రాజకీయ పార్టీలకు ఎన్నికల విరాళాలు సమకూర్చుతుంటుంది. దేశంలోని ఇతర పెద్ద కార్పొరేట్ సంస్థల మాదిరిగానే టాటా గ్రూప్ కూడా విరాళాలు ఇస్తున్నట్లు చెబుతున్నారు. అయితే దేశంలోని మొత్తం పది పార్టీలకు విరాళాలు ఇచ్చిన టాటా గ్రూపునకు చెందిన పీఈటీ అత్యధికంగా కేంద్ర ప్రభుత్వానికి సారథ్యం వహిస్తున్న బీజేపీకి రూ.757 కోట్లు అందజేయడమే చర్చనీయాంశం అవుతోంది. మొత్తం పది పార్టీలకు కలిపి రూ.914 కోట్లు విరాళంగా ఇవ్వగా, అందులో 83 శాతం నిధులను బీజేపీకే కేటాయించడంపై పెద్ద చర్చ జరుగుతోంది. పీఈటీ నుంచి ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్ పార్టీకి కేవంల రూ.77.3 కోట్లు మాత్రమే అందింది. ఇది బీజేపీకి అందిన విరాళంలో కేవలం 10 శాతం కూడా లేకపోవడం గమనార్హం. రెండు ప్రధాన జాతీయ పార్టీలతోపాటు తృణమూల్ కాంగ్రెస్, వైసీపీ, శివసేన, బీజేడీ, బీఆర్ఎస్, ఎల్జేపీ, జేడీయూ, డీఎంకే పార్టీలకు పీఈటీ నుంచి రూ.10 కోట్లు చొప్పున విరాళాలు అందాయి. ఇవన్నీ ఆయా రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న పార్టీలే కావడం గమనార్హం. తెలుగు రాష్ట్రాలకు చెందిన వైసీపీ, బీఆర్ఎస్ రూ.10 కోట్లు చొప్పున విరాళాలు అందుకోగా, ఆ రెండు పార్టీలు ఎన్నికల్లో ఓటమి పాలయ్యాయి. ఇక ఎన్నికల్లో అఖండ మెజార్టీతో గెలిచిన టీడీపీ, జనసేన పార్టీలకు ఒక్క రూపాయి కూడా టాటా నుంచి విరాళంగా అందకపోవడం గమనార్హం. 2024-25లో వివిధ ట్రస్టులు, సంస్థల నుంచి కాంగ్రెస్ పార్టీకి మొత్తంగా రూ.517 కోట్లు విరాళంగా అందాయి. ప్రుడెంట్ ఎలక్టోరల్ ట్రస్ట్ నుంచి రూ.216.33 కోట్లు, ఏబీ జనరల్ ఎలక్టోరల్ ట్రస్ట్ నుంచి రూ.15 కోట్లు న్యూ డెమొక్రటిక్ ఎలక్టోరల్ ట్రస్ట్ ద్వారా రూ.5 కోట్లు జన్ కల్యాణ్ ఎలక్టోరల్ ట్రస్ట్ నుంచి రూ.9.5 లక్షల చొప్పున కాంగ్రెస్ పార్టీకి విరాళాలు అందాయి.

# అవతార్-3లో వారణాసి స్పెషల్ వీడియో

'వారణాసి' సినిమాను దర్శకధీరుడు రాజమౌళి భారీ స్థాయిలో తెరకెక్కించనున్న విషయం తెలిసిందే. వీరిద్దరి కాంబినేషన్‌లో సినిమా వస్తుందని తెలిసినప్పటినుంచే ప్రపంచవ్యాప్తంగా ఆసక్తి ఏర్పడింది. తాజాగా దీనికి సంబంధించిన ఓ ఆసక్తికర విషయం హాలీవుడ్‌లోనూ వైరల్ అవుతోంది. అవతార్ 3 సినిమాలోను 'వారణాసి' సర్‌ప్రైజ్ ఉండనున్నట్లు హాలీవుడ్ మీడియా పేర్కొంది. దీంతో ఈ న్యూస్ సోషల్ మీడియాలో షేర్ అవుతోంది.'అవతార్' డైరెక్టర్ జేమ్స్ కామెరూన్ అంటే రాజమౌళికి ఎంత అభిమానమో తెలిసిన విషయమే. సందర్భం వచ్చినప్పుడల్లా జక్కన్న ఆయన గురించి చెబుతూనే ఉంటారు. ఇప్పుడు జేమ్స్ కామెరూన్ దర్శకత్వం వహించిన 'అవతార్ 3' సినిమాలో రాజమౌళి 'వారణాసి' సర్‌ప్రైజ్ ప్లాన్ చేసినట్లు వార్తలు వస్తున్నాయి. డిసెంబర్ 19న 'అవతార్ 3' ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఈ సినిమాలోనే 'వారణాసి'కి సంబంధించిన ప్రత్యేక వీడియోను ప్రదర్శించే ఆలోచన చేస్తున్నట్లు హాలీవుడ్ మీడియా పేర్కొంది. ప్రస్తుతం 'వారణాసి' సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఇందులో మహేశ్ రుద్ర పాత్రలో నటిస్తున్నారు. విలన్ పాత్ర కుంభగా పృథ్వీరాజ్ సుకుమారన్ కనిపించనున్నారు. ప్రియాంకా చోప్రా.. మందాకినిగా సందడి చేయనున్నారు. ఇప్పటికే విడుదలైన వీరి లుక్స్‌కూ విశేష స్పందన దక్కింది.



# సైక్ సిద్దార్థ నుంచి సాంగ్ విడుదల




శ్రీనందు హీరోగా నటిస్తూ.. స్వయంగా నిర్మిస్తోన్న చిత్రం 'సైక్ సిద్దార్థ' వరుణ్ రెడ్డి దర్శకత్వంలో రూపొందుతోంది. యామిని భాస్కర్ కథానాయిక. డిసెంబర్ 12న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో తాజాగా ఇందులోని లవ్‌సాంగ్‌ను విడుదల చేశారు. 'ధుమ్ తకుమ్..' అంటూ సాగే ఈ పాటకు కాశర్ల శ్యామ్ లిరిక్స్ రాయగా.. జెస్సీ గిఫ్ట్ ఆలపించారు.

# ఆర్థిక లావాదేవీలపై అనవసర వార్తల తగదు

**త్వరలోనే అఖండ-2 విడుదల ఉంటుదన్న దగ్గుబాటి**



నందమూరి బాలకృష్ణ, బోయపాటి శ్రీను కాంబినేషన్‌లో భారీ అంచనాల మధ్య రూపొందిన తాజా చిత్రం 'అఖండ 2' విడుదల వాయిదా పడటం టాలీవుడ్‌లో చర్చనీయాంశమైంది. వాస్తవానికి ఈ చిత్రం డిసెంబర్ 5న విడుదల కావాల్సి ఉండగా.. కొన్ని ఆర్థికపరమైన ఇబ్బందుల కారణంగా వాయిదా పడిన విషయం తెలిసిందే. ఈ వివాదంపై తాజాగా టాలీవుడ్ అగ్ర నిర్మాత, డిస్ట్రిబ్యూటర్ అయిన సురేష్ బాబు స్పందించారు. 'అఖండ 2' వాయిదాకు గల అసలు కారణాలను బయటపెట్టకుండా అనవసరపు ఊహాగానాలకు తెరదించారు. సైక్ సిద్దార్థ సినిమా కార్యక్రమంలో పాల్గొన్న సురేష్ బాబు 'అఖండ 2' ఇష్యూ గురించి ప్రస్తావిస్తూ.. నేను కూడా ఆ సమస్య గురించి మాట్లాడాటానికే వెళ్లాను. త్వరలోనే 'అఖండ 2' సమస్య పరిష్కారమవుతుంది. అఖండ 2 కి సంబంధించి అన్నీ ఆర్థికపరమైన ఇబ్బందులే అవి బయటకు వెల్లడించకూడదు అని అన్నారు. అలాగే సినిమాకు సంబంధించిన ఆర్థిక వ్యవహారాల గురించి ఎవరి ఇష్టం వచ్చినట్లు వాళ్లు రాస్తున్నారు. ఇది దురదృష్టకరం. ప్రతిఒక్కరూ 'అఖండ 2' రిలీజ్ కాకపోవడానికి ఏవేవో కారణాలు చెబుతున్నారు. అన్ని కోట్లు చెల్లించాలట అని రాస్తున్నారు. అవి అన్నీ అనవసరపు ప్రస్తావనలు అని సురేష్ బాబు స్పష్టం చేశారు. ఆడియన్స్ సినిమా ఎప్పుడు రిలీజ్ అవుతుందా అని ఎదురు చూస్తున్నారు. త్వరలోనే ఈ సమస్య పరిష్కారమై సినిమా విడుదలవుతుంది. అని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

-------------

# పుష్ప-2 విడుదలకు ఏడాది

**ఎమోషనల్ పోస్ట్ చేసిన అల్లు అర్జున్ -విమల్ థియేటర్‌లో పుష్ప-2 టిక్కెట్ల రగడ**

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ కథానాయకుడిగా సుకుమార్ దర్శకత్వంలో వచ్చిన బ్లాక్ బస్టర్ చిత్రం 'పుష్ప: ది రూల్' గతేడాది ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రం బ్లాక్ బస్టర్‌ను అందుకోవడమే కాకుండా రూ.1800 కోట్లకు పైగా వసూళ్లను రాబట్టింది. ఈ చిత్రం విడుదలై నేటికి ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా మూవీని గుర్తుచేసుకుంటూ అల్లు అర్జున్ సోషల్ మీడియా వేదికగా ఎమోషనల్ పోస్ట్ పెట్టారు. 'పుష్ప' ఫ్రాంచైజీ తన జీవితంలో ఒక మరువలేని ప్రయాణంగా మిగిలిందని అల్లు అర్జున్ పేర్కొన్నారు.'పుష్ప' మా జీవితంలో ఐదేళ్ల పాటు సాగిన మరువలేని ప్రయాణంగా నిలిచింది. ఈ చిత్రానికి ప్రేక్షకుల నుంచి లభించిన అపారమైన ప్రేమ, శక్తి, మా కళను మరింత లోతుగా అధ్యయనం చేయడానికి అవసరమైన ధైర్యాన్ని అందించింది. ఈ చిత్రాన్ని ఒక అద్భుతంగా మార్చినందుకు ఈ దేశంలోని ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రతి ఒక్కరికీ మేము ఎల్లప్పుడూ కృతజ్ఞులమై ఉంటాము. నా కళాకారులందరితో, సాంకేతిక నిపుణులతో, మొత్తం యూనిట్‌తో, నిర్మాతలు, పంపిణీదారులు మరియు ముఖ్యంగా మా కెప్టెన్ సుకుమార్ గారితో కలిసి ఈ ప్రయాణంలో నడవడం నాకు దక్కిన గొప్ప గౌరవం. ఈ ప్రయాణంలో భాగమైన మీ ప్రతి ఒక్కరికీ నేను ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. మరోసారి, హృదయం నిండా కృతజ్ఞతతో ధన్యవాదాలు అంటూ అల్లు అర్జున్ రాసుకోచ్చాడు. ఇదిలావుంటే బాలానగర్ విమల్ థియేటర్‌లో పుష్ప 2 టికెట్ల రగడ కొనసాగింది. పుష్ప 2 రిలీజ్‌కు ఏడాది పూర్తయిన సందర్భంగా విమల్ థియేటర్‌లో పుష్ప 2 సినిమా వేశారు. ఈ నేపథ్యంలో పలువురు అభిమానులకు టికెట్స్ అందలేదు దీంతో ఫ్యాన్స్ ఆగ్రహానికి గురయ్యారు. టికెట్స్ లేకపోవడంతో ఆగ్రహంతో రెండు వర్గాలకు చెందిన ఫ్యాన్స్ పొట్టుపొట్టు కొట్టుకున్నారు. ఈ ఘర్షణకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.



# తేరే ఇష్క్ మే తెలుగు ట్రైలర్ విడుదల



కోలీవుడ్ స్టార్ ధనుష్, బాలీవుడ్ హీరోయిన్ కృతి సనన్ జంటగా నటించిన రొమాంటిక్ డ్రామా 'తేరే ఇష్క్ మే'. ఈ చిత్రం నవంబర్ 28న ప్రేక్షకుల ముందుకు వచ్చి బాక్సాఫీస్ వద్ద సూపర్ హిట్ అందుకుంది. అయితే ఇదే సినిమాను తెలుగులో అమరకావ్యం పేరుతో విడుదల చేయబోతున్నారు. ఈ సందర్భంగా మూవీ నుంచి తెలుగు ట్రైలర్‌ను విడుదల చేసింది చిత్రబృందం. ఈ సినిమాకు ఆనంద్ ఎల్ రాయ్ దర్శకత్వం వహించగా.. ఏఆర్ రెహమాన్ సంగీతం అందించారు. ఆనంద్ ఎల్ రాయ్, ధనుష్ కాంబినేషన్‌లో 'రాంఝణా', 'అత్రంగి రే' తర్వాత మూడో చిత్రంగా ఈ సినిమా తెరకెక్కింది.

# ప్రతీ ఏటా జపాన్‌కు వస్తా...

**అభిమానులకు ప్రభాస్ హామీ**



పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ జపాన్‌లో సందడి చేశారు. ఎస్ఎస్ రాజమౌళి అద్భుత సృష్టి 'బాహుబలి' రెండు భాగాలను కలిపి 'బాహుబలి: ది ఎపిక్' పేరుతో అక్కడ ప్రత్యేకంగా ప్రదర్శించారు. ఈ నెల 12న ఈ సినిమా జపాన్‌లో విడుదల కానున్న నేపథ్యంలో ఈ స్పెషల్ స్క్రీనింగ్ కోసం ఆ దేశానికి వెళ్లిన ప్రభాస్, అక్కడి అభిమానులతో ప్రత్యేకంగా ముచ్చటించారు. తన వినయంతో, ఆప్యాయతతో అందరి మనసులు గెలుచుకున్నారు.

ఈ సందర్భంగా అభిమానులను ఉద్దేశించి ప్రభాస్ మాట్లాడారు. "మీ ప్రేమకు ధన్యవాదాలు. బాహుబలి తర్వాత రాజమౌళి, శోభు, లక్ష్మి అందరూ మీ గురించి చాలా గొప్పగా చెప్పారు. మీరు చాలా మంచి అభిమానులని, ఎమోషనల్ పీపుల్ అని అనేవారు. గడిచిన 10 ఏళ్లుగా జపాన్ గురించి వింటూనే ఉన్నాను. ఎట్టకేలకు మిమ్మల్ని చూశాను. థ్యాంక్యూ" అని అన్నారు.

"జపాన్‌కు వచ్చి మిమ్మల్ని వ్యక్తిగతంగా కలవాలనేది నా కల. అది ఇప్పుడు నెరవేరింది. లక్ష్మి గారిలాగే నేను కూడా ప్రతీ ఏటా ఇక్కడికి వచ్చి మిమ్మల్ని కలుస్తానని ఆశిస్తున్నాను" అని అభిమానులతో డార్లింగ్ అన్నారు. 'బాహుబలి: ది బిగినింగ్', 'బాహుబలి 2: ది కన్‌క్లూజన్' చిత్రాలను కలిపి ఒకే భాగంగా ఈ స్పెషల్ ఎడిషన్‌ను రూపొందించారు. ప్రభాస్ రాకతో భారతీయ సినిమాకు, జపాన్ ప్రేక్షకులకు మధ్య బంధం మరింత బలపడింది.

ప్రస్తుతం ప్రభాస్ 'ది రాజాసాబ్', 'స్పిరిట్', 'ఫౌజి', 'సలార్: పార్ట్ 2 %-% శౌర్యాంగ పర్వం', 'కల్కి 2898 ఏడీ పార్ట్ 2' వంటి భారీ ప్రాజెక్టులతో బిజీగా ఉన్నారు. 'బాహుబలి' సిరీస్‌లో రానా, అనుష్క, తమన్నా, రమ్యకృష్ణ, సత్యరాజ్, నాజర్ వంటి ప్రముఖ నటులు కీలక పాత్రలు పోషించిన విషయం తెలిసిందే.

# చిన్నప్పుడు దేవుడితో గొడవపడేదాన్నని

**- భాగ్యశ్రీ**



యంగ్ హీరోయిన్ భాగ్యశ్రీ బోర్సే తన వ్యక్తిగత విశ్వాసాలు, దైవచింతనకు సంబంధించిన ఓ ఆసక్తికరమైన విషయాన్ని అభిమానులతో పంచుకున్నారు. చిన్నతనంలో తనకు ఏదైనా కష్టం వస్తే దేవుడినే తన తండ్రిగా భావించి ఆయనతో పోట్లాడేదాన్నని, కానీ ఇప్పుడు ఆ దేవుడి నిర్ణయాలనే పూర్తిగా విశ్వసిస్తున్నానని తెలిపారు. శుక్రవారం నాడు ఓ ఆలయంలో ప్రశాంతంగా ఉన్న వీడియోను తన ఇన్‌స్టాగ్రామ్ పేజీలో పోస్ట్ చేస్తూ ఈ వ్యాఖ్యలు చేశారు."నాకు గుర్తుంది.. చిన్నప్పుడు జీవితంలో ఎలాంటి కష్టం వచ్చినా నేను చేసే మొదటి పని దేవుడితో గొడవపడటమే. ఆయనే నా తండ్రి అన్నట్లు ప్రతీసారి ప్రశ్నించేదాన్ని. కానీ ఇప్పుడు నేను ఓ దశకు చేరుకున్నాను. నాకేది మంచిదో ఆయనకు కచ్చితంగా తెలుసని ఇప్పుడు నేను నమ్ముతున్నాను" అని తన పోస్టులో ఆమె రాసుకొచ్చారు. ప్రస్తుతం ఆమె కెరీర్ పరంగా మంచి విజయాలు అందుకుంటున్న నేపథ్యంలో ఈ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.ఇటీవల భాగ్యశ్రీ నటించిన 'కాంత', 'ఆంధ్రా కింగ్ తాలూకా' చిత్రాల్లో ఆమె నటనకు విమర్శకుల నుంచి, ప్రేక్షకుల నుంచి ప్రశంసలు వెల్లువెత్తాయి. ముఖ్యంగా సెల్వమణి సెల్వరాజ్ దర్శకత్వంలో వచ్చిన పీరియడ్ డ్రామా 'కాంత'లో ఆమె పోషించిన కుమారి పాత్రకు విశేషమైన స్పందన లభించింది. ఈ సినిమా విజయంపై ఆమె మాట్లాడుతూ, కష్టపడితే కచ్చితంగా మంచి ఫలితాలు వస్తాయని తాను నమ్ముతున్నట్లు తెలిపారు.నటుడు రానా దగ్గుబాటిని తన గురువుగా అభివర్ణిస్తూ, "మొదటి రోజు నుంచి నాకు మద్దతుగా నిలిచిన రానాకు ధన్యవాదాలు. మీరు నిజమైన స్నేహితుడు, మంచి వ్యక్తి. ఈ ప్రయాణంలో మీరు నా గురువుగా ఉండటం నా అదృష్టం. మీ మార్గదర్శకత్వం లేకపోతే నేను ఇది చేయగలిగేదాన్ని కాదు" అని తెలిపారు. ఇక తన సహనటుడు దుల్కర్ సల్మాన్‌ను ప్రశంసిస్తూ, "ప్రియమైన దుల్కర్, మీరు నిజమైన 'నడిప్పు చక్రవర్తి'. మీ పక్కన నటించడం గొప్ప అనుభూతి. ప్రతీ ఫ్రేమ్‌లో మీరు అద్భుతంగా కనిపించారు. నటుడిగా మా అందరికీ మీరు ఒక స్ఫూర్తి" అని ఆమె పోస్టులో పేర్కొన్నారు.